


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు

సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 12.02.2026 | సంపుటి : 3 | సంచిక :12 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Tuesday | 12.02.2026 | volume : 3 | Issue : 12 | Pages : 8 | Cost : 2/-


# మూడు కార్పొరేషన్లుగా గ్రేటర్ హైదరాబాద్

**పరిపాలనలో విప్లవాత్మక మార్పు, పరిపాలన సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**

హైదరాబాద్, రాజముద్ర న్యూస్ :

తెలంగాణ ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుంది. దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా మారిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి)ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించింది. ఫిబ్రవరి 11న జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్. 55 ద్వారా ఈ మార్పు అధికారికం అయింది. పాలకమండలి గడువు ముగిసిన ఒక రోజు తర్వాత వచ్చిన ఈ నిర్ణయం నగర పరిపాలనలో కొత్త అధ్యాయం ప్రారంభించింది.

## ఎందుకు ఇంత పెద్ద మార్పు?

2025 డిసెంబరులో ప్రభుత్వం 27 పురపాలికలను జిహెచ్‌ఎంసి లో విలీనం చేసి, నగర విస్తీర్ణాన్ని 650 చ.కి.మీ. నుంచి 2,053 చ.కి.మీ.కి పెంచింది. జనాభా 1.34 కోట్లకు చేరుకుంది. అప్పుడు 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులు ఉండగా... ఇప్పుడు 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులూ పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఇంత పెద్ద సంస్థను ఒకే కార్పొరేషన్‌గా నడపడం అసాధ్యం అని అధికారులు భావించారు. పౌరుల సమస్యలు సకాలంలో పరిష్కరించడం, అభివృద్ధి పనులు వేగవంతం చేయడం కష్టమైంది. కాబట్టి పరిపాలనా సౌలభ్యం కోసం త్రిభజనకు నిర్ణయించారు.




### గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (పాత జిహెచ్‌ఎంసి కోర్)

- జోన్లు: శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ (6 జోన్లు)
- అంచనా వార్డులు: 150
- జనాభా: సుమారు 68 లక్షలు
- కమిషనర్: ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్
- ఇది చారిత్రక నగరం, పాతబస్తీ, విమానాశ్రయం వైపు ప్రాంతాలను కవర్ చేస్తుంది.

### సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (పశ్చిమ ఐటి కారిడార్)

- జోన్లు: శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ (3 జోన్లు)
- అంచనా వార్డులు: 76
- జనాభా: సుమారు 35 లక్షలు
- కమిషనర్: జి. సృజన, ఐఏఎస్
- హైటెక్ సిటీ, మధాపూర్, పటాన్ చెరువు వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు.

### మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (తూర్పు-ఉత్తర నివాస ప్రాంతాలు)

- జోన్లు: మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్.బి. నగర్ (3 జోన్లు)
- అంచనా వార్డులు: 74
- జనాభా: సుమారు 31 లక్షలు
- కమిషనర్: టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్
- కాప్రా, ఘట్కేసర్, నాగోల్ వంటి ప్రాంతాలు.

**లాభాలు :**

- ప్రతి కార్పొరేషన్ చిన్నది కాబట్టి పౌరుల సమస్యలు (నీరు, రోడ్లు, డ్రెయినేజీ) త్వరగా పరిష్కరించవచ్చు.
- స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులు రూపొందించవచ్చు.
- ఐటీ ప్రాంతాలకు ప్రత్యేక దృష్టి, పాతబస్తీ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సాధ్యం.

**సవాళ్లు:**

- మూడు కార్పొరేషన్ల మధ్య సమన్వయం ఎలా? (పెద్ద ప్రాజెక్టులు, అప్పుల విభజన, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్)
- కొత్త ఎన్నికలు (ఆగస్టు 2026లోపు) వరకు స్పెషల్ అధికారులు నిర్వహించాలి.
- రాజకీయంగా -- కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మార్పుతో ఎన్నికల్లో లాభం పొందే అవకాశం ఉందని విమర్శలు వస్తున్నాయి.

**పౌరులకు ఏమి మారుతుంది?**




మీ వార్డు ఏ కార్పొరేషన్‌లోకి వస్తుందో తెలుసుకోండి. కార్పొరేటర్‌ను సంప్రదించడం సులభం అవుతుంది. ఆస్తి పన్ను, ఇళ్ల పన్ను చెల్లింపు, ఫిర్యాదులు -- అన్నీ స్థానిక కార్యాలయాల్లోనే జరుగుతాయి. ఈ మార్పు నగరాన్ని మరింత సమర్థవంతంగా, పౌరులకు సమీపంగా తీర్చిదిద్దుతుంది. కానీ సమన్వయం సరిగా ఉంటేనే ఫలితం కనిపిస్తుంది. హైదరాబాద్ ఇక మూడు రంగాల్లో ముందుకు సాగుతుంది -- చారిత్రక హైదరాబాద్, ఐటీ సైబరాబాద్, నివాస మల్కాజిగిరి.



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| పారం ధర లైవ్ బర్డ్ | 125 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 152 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 220 (కిలో) |
| స్కిన్ లెస్ | 251 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹72

# పురపోరు ఎగ్జిట్ పోల్స్‌లో కాంగ్రెస్‌దే హవా

**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ విజయం అంచనా**

దాదాపు 70 నుంచి 85 మున్సిపాలిటీలు గెలుచుకోనున్న అధికార పార్టీ

బీఆర్ఎస్, బీజేపీలు చాలా వెనుకబడి ఉన్నాయని తేల్చిన సర్వేలు

నిజామాబాద్, కరీంనగర్‌లలో బీజేపీకి, మిగిలిన కార్పొరేషన్లలో కాంగ్రెస్‌కు ఆధిక్యం

ఫిబ్రవరి 13న వెలువడనున్న అధికారిక ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

02






## మూడు కార్పోరేషన్లుగా హైదరాబాద్

(మొదటిపేజీ తరువాయి)

కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయగా.. సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్‌లతో జీహెచ్ఎంసీని విభజించింది. ప్రస్తుతం 1450 చదరపు కిలోమీటర్ల మేర మంచినీటి సరఫరాతో పాటు 650 చ.కి.మీ.ల మేర సివరేజ్ నిర్వహణ చేస్తున్న జలమండలి.. ఇక నుంచి 2,053 చ.కి.మీ. మేర మంచినీటి సరఫరాతో పాటూ సివరేజ్ నిర్వహణ చూడనుంది. కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు నిర్మించేందుకు జలమండలి చర్యలు తీసుకోనుంది. జీహెచ్ఎంసీని మొత్తం 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 వార్డులుగా ప్రభుత్వం విభజించింది. శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్‌లను జోన్లుగా నిర్ణయించింది. ఆయా జోన్ల పరిధిలో సర్కిళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

**శంషాబాద్ జోన్:** ఆదిభట్ల, బడంగ్‌పేట్, జల్‌పల్లి, శంషాబాద్. చార్మినార్ జోన్: సంతోష్ నగర్, యాకత్‌పురా, మలక్‌పేట, చార్మినార్, మూసారాంబాగ్,
**ఖైరతాబాద్ జోన్:** ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట, రాజేంద్రనగర్ జోన్: రాజేంద్రనగర్, అత్తాపూర్, బహదూర్‌పుర, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్,
**గోల్కొండ జోన్:** గోషామహల్, కార్వాన్, గోల్కొండ, మెహిదీపట్నం, మాసాబ్ ట్యాంక్. సికింద్రాబాద్ జోన్: కవాడిగూడ, ముషీరాబాద్, అంబర్‌పేట్, తార్నాక, మెట్టుగూడ

## రాష్ట్రంలో ఐఏఎస్‌ల బదిలీలు

- సింగరేణి సీఎండీగా జ్యోతిబుద్ధ ప్రకాశ్
- మూడు కార్పొరేషన్లకు స్పెషలాఫీసర్‌గా జయేశ్‌రంజన్
- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా కర్ణన్ కొనసాగింపు

**హైదరాబాద్:** ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధప్రకాశ్ సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీగా బదిలీ అయ్యారు. సింగరేణి సంస్థ సీఎండీ అదనపు బాధ్యతల నుంచి డి.కృష్ణభాస్కర్‌ను ప్రభుత్వం ఉపసంహరించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలుగా విభజించిన ప్రభుత్వం ఈ మూడింటికి ప్రత్యేకాధికారి (స్పెషల్ ఆఫీసర్)గా పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్‌ను నియమించడంతోపాటు, మూడు కార్పొరేషన్లకు ముగ్గురు ఐఏఎస్‌లను కమిషనర్లుగా నియమించింది. ఈ మేరకు రాష్ట్రంలో పలువురు ఐఏఎస్, నాన్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నైనీ బొగ్గు బ్లాకు ఓవర్‌బర్డన్ తొలగింపునకు సంబంధించి నిర్వహించిన టెండర్లలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సింగరేణి సీఎండీగా అదనపు బాధ్యతల్లో ఉన్న కృష్ణభాస్కర్‌ను తప్పించి పూర్తిస్థాయి సీఎండీగా జ్యోతిబుద్ధప్రకాశ్‌ను ప్రభుత్వం నియమించింది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచీ ఘోష్‌కు ప్రభుత్వం ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ఎస్సీల అభివృద్ధి విభాగం కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ రెండు పోస్టుల బాధ్యతల నుంచి జ్యోతిబుద్ధప్రకాశ్‌ను ఉపసంహరించుకుంది. ఎస్టీల అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ఎస్టీల అభివృద్ధి విభాగం కమిషనర్‌గా సబ్యసాచీ ఘోష్‌కు మరో రెండు పోస్టుల్లో కూడా సర్కార్ అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శిగా, తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ రెండు పోస్టుల అదనపు బాధ్యతల నుంచి జ్యోతిబుద్ధ ప్రకాశ్‌ను ఉపసంహరించింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈఓ డి.దివ్యకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి శ్రుతి ఓఝాను తప్పించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో 7 కార్పొరేషన్లు, 20 పురపాలికలను విలీనం చేసి ఏర్పాటు చేసిన కొత్త జీహెచ్ఎంసీని ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లుగా పునర్విభజించిన విషయం తెలిసిందే. కాగా, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్‌వీ కర్ణన్‌ను అదే పోస్టులో కొనసాగిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్లు జి.సృజన, టి.వినయ్‌కృష్ణారెడ్డిలను సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లకు కమిషనర్లుగా బదిలీ చేసింది. సెర్ప్ అదనపు సీఈఓ పి.కాత్యాయినీ దేవిని ప్రజావాణి నోడల్ అధికారిగా బదిలీ చేస్తూ ఆ పోస్టు అదనపు బాధ్యతల నుంచి డి.దివ్యను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. రాష్ట్ర ఆర్థిక సంఘం జేఎండీగా అదనపు బాధ్యతల్లో పి.కాత్యాయినీ దేవి కొనసాగుతారని స్పష్టం చేసింది. హైదరాబాద్ జలమండలి ఈడీని అదే సంస్థ జేఎండీగా బదిలీ చేసింది. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఓఎస్డీ యు.రఘురామ్‌శర్మను పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ చేసింది. ఆయన మంత్రి శ్రీధర్‌బాబుకు ఓఎస్డీగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతారని తెలిపింది.

## మున్సిపోల్స్‌లో రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగం

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు చేసినా వీరోచితంగా పోరాడిన గులాబీ సైనికులందరికీ పేరుపేరునా హృదయపూర్వక అభినందనలు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకూ పురపాలక సమరంలో మీరు కనబరిచిన పోరాట స్ఫూర్తి బీఆర్ఎస్‌కు కొండంత బలాన్నిచ్చింది. పార్టీలో ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. రెండేళ్ల పాలనలో ఘోరమైన పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్.. ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో ఇంతటి దౌర్జన్య కాండకు దిగారు. కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో మొదలైన పరాభవం, పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే అడుగడుగునా రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు' అని కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అక్రమంగా లూటీ చేసిన వేలకోట్ల ప్రజాధనంతో ప్రజాతీర్పునే మార్చాలన్న ఈ కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. పోలీసు శాఖను అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపుల పర్వానికి, దాడులకు రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రజలకిచ్చిన హామీలను, మొత్తంగా పరిపాలనను గాలికి వదిలేసి రాష్టాన్ని సంక్షోభంలోకి నెట్టిన పాపం రేవంత్ రెడ్డిని ప్రతినిత్యం వెంటాడుతూనే ఉంటుంది' అంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# పురపోరు ఎగ్జిట్ పోల్స్‌లో కాంగ్రెస్‌దే జోరు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** వివిధ సర్వే సంస్థల అంచనాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం కాంగ్రెస్ 68 నుంచి 76 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందని వెల్లడించగా, బీకాన్ సర్వే ఏకంగా 80-85 పీఠాలు గెలుచుకుంటుందని పేర్కొంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ 8 నుంచి 36 స్థానాలకు, బీజేపీ 3 నుంచి 6 స్థానాలకు పరిమితం కావచ్చని ఈ సర్వేలు అంచనా వేశాయి. వార్డుల వారీగా చూస్తే, ఆపరేషన్ చాణక్య సర్వే మరింత లోతైన విశ్లేషణ అందించింది. మొత్తం మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్‌కు 1400-1449 వార్డులు (48% ఓట్లు), బీఆర్ఎస్‌కు 745-793 వార్డులు (26% ఓట్లు), బీజేపీకి 358-399 వార్డులు (13% ఓట్లు) దక్కే అవకాశం ఉందని తెలిపింది. ఆశ్చర్యకరంగా జనసేన పార్టీ 30-35 వార్డులు గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొనడం గమనార్హం. ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపిస్తోంది. అయితే, ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో బీజేపీ ఆధిక్యం ప్రదర్శించవచ్చని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. మహబూబ్‌నగర్, మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లలో కాంగ్రెస్ ఏకపక్ష విజయం సాధిస్తుందని తెలిపింది. కొత్తగూడెంలో కాంగ్రెస్‌కు, సీపీఐకి మధ్య గట్టిపోటీ ఉండగా, బీఆర్ఎస్ మూడో స్థానానికే పరిమితం కావచ్చని సర్వేలు చెబుతున్నాయి. సామాజిక వర్గాల వారీగా ఎస్సీ, ముస్లిం మైనారిటీ ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ఈ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమైతే తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ తన పట్టును మరింత బలోపేతం చేసుకున్నట్లే. అయితే ఇవి కేవలం అంచనాలు మాత్రమేనని, అసలు ఫలితాలు ఫిబ్రవరి 13న జరిగే ఓట్ల లెక్కింపు తర్వాతే వెల్లడవుతాయి. ఈ ఫలితాలపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.



## పోలింగ్ 73.03 శాతం



(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73.03 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే, ఏడు కార్పొరేషన్ల పరిధిలో 66.05 శాతం పోలింగ్ నమోదు కాగా, 116 మున్సిపాలిటీల్లో 75.88 శాతం ఓటింగ్ జరిగింది. అత్యధికంగా చౌటుప్పల్ మున్సిపాలిటీలో 91.91 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. అదే సమయంలో, అత్యల్పంగా నందికొండ మున్సిపాలిటీలో 59.68 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అయితే, క్యూ లైన్లలో నిల్చున్న వారికి రాత్రి 7 గంటల వరకు ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,203 పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.
కొన్ని చోట్ల స్వల్ప ఘర్షణలు మినహా, పోలింగ్ ప్రక్రియ మొత్తం ప్రశాంత వాతావరణంలో సాగింది. వృద్ధులు, వికలాంగులకు పోలీసులు సహాయం అందించి ఓటు వేయించారు. పోలీసు సిబ్బంది అంకితభావంతో పనిచేశారని డీజీపీ శివధర్ రెడ్డి ప్రశంసించారు. ఈ ఎన్నికల్లో 52 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 14న మేయర్, చైర్‌పర్సన్ల ఎన్నిక, ఫిబ్రవరి 16న వారి ప్రమాణ స్వీకారం ఉంటాయి.

## పురపోరులో సత్తా చాటుతాం: సీఎం రేవంత్



**న్యూఢిల్లీ:** రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందని, మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంటామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. దీంతో ఇదే ఊపుతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ముందుకెళ్లాలని ఖర్గే చెప్పారు. బుధవారం ఢిల్లీ వచ్చిన ఆయన నేరుగా తుగ్లక్ రోడ్డులోని అధికార నివాసానికి చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల సమయంలో రాజాజీ మార్గ్‌లోని ఖర్గే నివాసంలో ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం వెంట ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, మున్సిపల్ ఎన్నికలు, విజయావకాశాలపై సుమారు 30 నిమిషాల పాటు నేతలు చర్చించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ వంటి అంశాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని, మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాలు పార్టీకి కలిసివస్తాయని రేవంత్ వివరించారు. 70 శాతానికిపైగా స్థానాల్లో విజయం సాధిస్తామని, మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకుంటామని చెప్పారు. గెలిచిన మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ల పదవుల్లో బీసీ సామాజిక వర్గం, మహిళలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై కూడా ఖర్గే, రేవంత్ చర్చించినట్లు సమాచారం. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పినట్లు సమాచారం. ఈ సందర్భంగా కొద్దిసేపు ఖర్గే, రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయినట్లు తెలిసింది.

### బీఆర్ఎస్, బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండండి

ఇటీవల రాజకీయ, పాలనా పరమైన అంశాలు బయటకు రావడంపై ఇద్దరు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. పార్టీ యంత్రాంగం, ప్రభుత్వం మధ్య సమన్వయం దెబ్బతినకుండా చూసుకోవాలని, నేతల మధ్య విభేదాలు ఉన్నా వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని రేవంత్‌కు ఖర్గే హితబోధ చేసినట్లు సమాచారం. అదే సమయంలో బీఆర్ఎస్, బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖర్గే సూచించారు. ఒకవైపు బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతూనే, మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలంటూ ఖర్గే దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

### నేడు కేంద్ర మంత్రులతో భేటీ

ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి గురువారం రాష్ట్రానికి సబంధించిన పలు అంశాలపై పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నట్లు తెలిసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఆహార పంపిణీ శాఖ మంత్రి ప్రల్హాద్ జోషిని కలిసి అవకాశం ఉందని తెలుస్తోంది. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోనూ భేటీ కానున్నట్లు సమాచారం.

## జనగణన నోటిఫికేషన్ తర్వాత కార్పొరేషన్ల ఏర్పాటు చట్టవిరుద్ధం

విమర్శించారు. మూసీ ప్రక్షాళన చేయాలని భాజపా కూడా కోరుకుంటోందన్నారు. మంచి పని చేస్తామంటే ఎవరూ వద్దంటారని.. చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఎట్లా చేస్తారని ప్రశ్నించారు. డబ్బు, అధికార మదంతో మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవాలని ప్రయత్నం చేసిందని దుయ్యబట్టారు. ఇంత పెద్దఎత్తున అధికార దుర్వినియోగం ఎప్పుడూ జరగలేదన్నారు. ఏ పార్టీ నుంచి గెలిచినా కాంగ్రెస్ పార్టీ బలపరిచే ఛైర్మన్‌కు మద్దతు ఇవ్వాలని ఇప్పటి నుంచే బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. విజయం సాధించిన ఏ ఒక్క భాజపా అభ్యర్థికి ఏదైనా జరిగితే రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలని హెచ్చరించారు.



## ఆధారాల్లేకుండా వేటు వేస్తారా?

- అధికారులకు సుప్రీంకోర్టు చురకలు
- బకాయిలన్నీ చెల్లించి విధుల్లోకి తీసుకోండి
- ఫోర్జరీ పేరుతో కోర్టు అటెండర్ తొలగింపుపై ఆగ్రహం
- తెలంగాణ హైకోర్టు తీర్పు కొట్టివేత

**న్యూఢిల్లీ:** ఒక చిన్న ఉద్యోగిపై అధికారులు ప్రదర్శించిన అత్యుత్సాహంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అనారోగ్యంతో విధులకు హాజరు కాని పాపానికి, ఫోర్జరీ ముద్రవేసి ఉద్యోగం నుంచి తొలగించిన కరీంనగర్ కోర్టు అధికారుల నిర్ణయాన్ని తప్పుబట్టింది. ఆరోపణలు తీవ్రమైనవి అయినప్పుడు.. విచారణ కూడా అంతే పకడ్బందీగా ఉండాలని హితవు పలుకుతూ, సదరు ఉద్యోగిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ విపుల్ ఎం.పంచోలి ధర్మాసనం తీర్పు వెలువరించింది. కరీంనగర్ అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కె.రాజయ్య అనే వ్యక్తి ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్)గా పనిచేస్తున్నారు. 2017 ఆగస్టులో కడుపునొప్పి, జ్వరం కారణంగా ఆయన 4 రోజులపాటు విధులకు హాజరు కాలేదు. అనధికారికంగా డుమ్మా కొట్టారంటూ అధికారులు మెమో ఇవ్వగా.. తాను అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్నానంటూ రాజయ్య ఒక ప్రైవేట్ డాక్టర్ ఇచ్చిన మెడికల్ సర్టిఫికెట్‌ను సమర్పించారు. అయితే, ఆ సర్టిఫికెట్ ఇచ్చిన డాక్టర్‌కు కోర్టు నోటీసులు పంపగా.. ఆయన మాట మార్చారు. 'ఆ లెటర్ హెడ్ నాదే కానీ, ఆ సర్టిఫికెట్ నేను ఇవ్వలేదు.. ఎవరో నా లెటర్ హెడ్ దొంగిలించి ఫోర్జరీ చేశారు' అంటూ డాక్టర్ చెప్పడంతో కథ అడ్డం తిరిగింది. కేవలం ఆ డాక్టర్ మాటలను నమ్మిన విచారణాధికారి.. రాజయ్య ఫోర్జరీ చేశాడని నిర్ధారించారు. ఫలితంగా 2018లో రాజయ్యను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేశారు. దీనిని సవాలు చేస్తూ రాజయ్య తెలంగాణ హైకోర్టుకు వెళ్లినా నిరాశే ఎదురైంది. హైకోర్టు కూడా అధికారుల చర్యను సమర్థించింది.

### రబ్బరు స్టాంపే సాక్ష్యం

రాజయ్య అప్పీల్‌ను విచారించిన సుప్రీం ధర్మాసనం.. రికార్డులను తెప్పించి క్షుణ్ణంగా పరిశీలించింది. డాక్టర్ కోర్టు నోటీసు తీసుకున్నప్పుడు వేసిన రబ్బరు స్టాంపు, రాజయ్య సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్‌పై ఉన్న రబ్బరు స్టాంపు రెండూ ఒకేలా ఉన్నాయని సుప్రీంకోర్టు గుర్తించింది. ఒక ఉద్యోగి జీవితాన్ని నాశనం చేసేంత పెద్ద శిక్ష వేస్తున్నప్పుడు.. కనీసం చేతిరాత నిపుణుడితో ఎందుకు సరిచూడలేదని అధికారులను ప్రశ్నించింది. కేవలం డాక్టర్ మాట నమ్మి, ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేకుండా ఫోర్జరీ అని ఎలా తేలుస్తారని మండిపడింది. రాజయ్యను వెంటనే తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని... ఉద్యోగం తొలగించిన నాటి నుంచి నేటి వరకు రావాల్సిన పూర్తి జీతభత్యాలు మూడు వారాల్లోగా చెల్లించాలని సుప్రీం ఆదేశించింది. అంతేగాక రాజయ్యను ఉద్యోగంలో కొనసాగించాలని స్పష్టంచేసింది.

# ఓటేసిన పలువురు ప్రముఖులు

- కొడంగల్‌లో ఓటేసిన సిఎం రేవంత్
- మధిరలో ఓటేసిన భట్టి విక్రమార్క





**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు కొనసాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీల్లో ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగిం చుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో ఓటేశారు. నిజామాబాద్ పట్టణంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ పట్టణంలో ఓటేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకోవాలని బండి సంజయ్ కోరారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్‌లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపి ధర్మపురి అర్వింద్ తదితరులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నరు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది.








## అధికార దుర్వినియోగం.. ఉల్లంఘనలు

### మున్సిపోల్స్‌పై హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** మున్సిపల్ ఎన్నికల్లో.. ముఖ్య మంత్రి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్విని యోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆక్షేపించారు. బీఆర్‌ఎ స్ అభ్యర్థులను బెదిరించడం, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హేయమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు. చట్టాన్ని లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని ఖండించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అధికార పార్టీ అకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్‌పై విశ్వాసంతో ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు చెప్పారు.

## ఎన్‌స్టీన్ ఫైల్లో అనిల్, హర్దీప్ పురీల పేర్లు

### కేంద్రం చర్యలకు వెనకాడుతోంది : రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 :** రాహుల్ పార్లమెంటు వెలుపుల విలేకరులతో మాట్లాడుతూ.. 'హర్దీప్ పూరీ, అనీల అంబానీల పేర్లతో ఉన్న ఎప్‌స్టీన్ ఫైళ్లు న్యాయశాఖ వద్ద ఉన్నాయి. అదానీపై కొనసాగుతున్న కేసులో ఇప్పటికే సమన్లు జారీ చేయబడ్డాయి. దీనిపై గత 18 నెలలుగా భారత ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. ఈ విషయంపై ప్రధానిపై ప్రత్యక్ష ఒత్తిడి ఉంది. ఇక్కడ ప్రధాన విషయం ఏమిటంటే డేటా పరంగా చూసినా..ఇప్పటివరకు రైతులు, ఇంధన భద్రత, రక్షణ పరంగా కూడా ఏ ప్రధానమంత్రి కూడా ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఇలా చేయలేదు అని అన్నారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కింద కీలకమైన జాతీయ ప్రయోజనాలను ప్రధాని మోడీ వదులుకున్నారని రాహుల్‌గాంధీ విమర్శించారు. ఆర్థిక సర్వేపై మాట్లాడుతూ..ప్రపంచ క్రమం అమెరికా ఆధిపత్యంలో ఉన్న ఏకధ్రువ వ్యవస్థ నుండి చైనా, రష్యాలు సవాలు చేసే బహుళ ధ్రువ వ్యవస్థ దిశగా పయనిస్తోందని అన్నారు. ఇంధనం, ఆర్థికరంగాలను ఈ ఒప్పందం దెబ్బతీస్తోందని అన్నారు. డాలర్ ఆధిపత్యం ఒత్తిడిలో ఉందని, ప్రపంచం అస్థిరత మరియు సంఘర్షణలోకి వెళుతోందని అన్నారు. కృత్రిమ మేథస్సు (ఎఐ) అంతర్జాతీయంగా పోటీకి కేంద్ర బిందువుగా మారిందని అన్నారు. భారతదేశ సాఫ్ట్‌వేర్‌రంగాన్ని ఎఐ దెబ్బతీస్తోందని, ఇన్ఫోసిస్ మరియు ఇతర కంపెనీల్లో పెద్ద సంఖ్యలో ఇంజనీర్లను భర్తీ చేస్తోందని హెచ్చరించారు. భారతదేశ బలం, దాని 140 కోట్ల ప్రజలు ఉత్పత్తి చేసే డేటాలో ఉందని అన్నారు. అమెరికన్ వస్తువులు తమకు అనుకూలమైన నిబంధనలతో దేశీయ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయని అన్నారు. భారతదేశ అమెరికా ఎగుమతులు 46 బిలియన్ డాలర్ల నుండి 146 బిలియన్ డాలర్లకు పెరగడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే అమెరికా నుండి తగిన నిబద్ధత ఎందుకు లేదని ప్రశ్నించారు. గతంలో తాను హర్యానా, గురుగావ్‌లోని పరిశ్రమలను సందర్శించానని, టారిఫ్‌ల మార్పులు పరిశ్రమలను తీవ్రంగా దెబ్బతీయనున్నాయని వాటి యజమానులు ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు.

## ఎన్నికల అధికారుల తీరుపై ఎంపి ఆగ్రహం

**నిజామాబాద్,ఫిబ్రవరి11 :** నిజామాబాద్‌లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ హల్‌చల్ చేశారు. హరిచరణ్ మార్వాడీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో పోలీసులు, ఎన్నికల సిబ్బందిపై అర్వింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అభ్యర్థిని పోలీసులు బయటకు పంపేశారని, ఎన్నికల సిబ్బంది తమకు సహకరించడం లేదని ఎంపీకి కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎంపీ.. పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. సంగతి చూస్తాను అని పోలీసులను ఉద్దేశించి హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం పంపిన ఎంపీ అర్వింద్.. బీజేపీ అభ్యర్థిని బయటకు పంపిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## థాయి స్కూల్‌లో నరమేధం

- దుండగుడి కాల్పుల్లో 34మంది హతం
- మృతుల్లో 22 మంది చిన్నారులు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 :** దక్షిణ థాయిలాండ్ లో ఘోరం జరిగింది. బుధవారం మధ్యాహ్నం సోంగ్ఖా హ్యాట్ హెయ్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఓ సాయుధుడు కాల్పులకు తెగబడ్డాడు. నిందితుడు జరిపిన కాల్పుల్లో 22మంది చిన్నారులు సహా 34మంది మరణించారు. చాలా మందిని అతను బందీలుగా చేసుకున్నాడు. పాఠశాలలో కాల్పుల మోత వినపడగానే రోడ్డుపై జనాలు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. దీనికి సంబంధించిన ఓ వీడియో ఇంటర్నెట్ లో వైరల్ అవుతోంది. సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనేక మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల లోపల చిక్కుకున్నారని పోలీసులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు హాట్ యాయ్ పోలీసులు పాఠశాలను చుట్టుముట్టారు. సాయుధుడితో చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. కాల్పులు జరిపిన వ్యక్తికి 18 ఏళ్ల వయసు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. పాఠశాల లోపల ఉన్న బందీలను సురక్షితంగా విడిపించేందుకు భద్రతా దళాలు ప్రస్తుతం ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. అయితే తరవాత అతను ఆత్మహత్య చేసుకున్నట్లు సమచారం.



## గ్రేటర్ హైదరాబాద్ విభజన సరైనదే

### స్వాగతించిన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ని తెలంగాణ ప్రభుత్వం మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజించింది. హైదరాబాద్‌ను మూడు డివిజన్లుగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. 'గ్రేటర్ హైదరాబాద్ ను మూడు కార్పొరేషన్లుగా విభజించడం ద్వారా నగరానికి మంచి జరగబోతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా.. ఇది ఆయన సొంతంగా తీసుకున్న నిర్ణయం కాదు. పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, విపక్షాల అభిప్రాయం తీసుకున్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తెలంగాణ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రాంతీయ కార్యాలయంలో నేరుగా సమస్యలు పరిష్కారం అవుతాయి. బీఆర్‌ఎస్ రాజకీ యం కోసం మాట్లాడుతున్నారు. వాళ్లు అధికారంలో ఉన్న రోజుల్లో ఏమీ పట్టించుకోలేదు. రాజకీయాల కోసం ప్రతిపక్షాల విమర్శలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. వేగవంతమైన అభివృద్ధికి ఈ నిర్ణయం గొప్ప ఊతమిస్తుంది. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రాత్మక నిర్ణయం.. దీన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నా' అని అన్నారు.

## సైబరాబాద్‌లో ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

### ఎన్నికల తీరును పరిశీలించిన కమిషనర్ రమేశ్



**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలు నేపథ్యంలో బందోబస్తు, తీరును సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. సీపీ ముందుగా కుత్బుల్లాపూర్ జోన్ లోని మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావెల్ కోల్ జెడ్పీహెచ్ స్కూల్, ఎల్లంపేట జెడ్పీహెచ్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల్లో పర్యటించారు. అనంతరం జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి లోని అలియాబాద్ మున్సిపాలిటీలో ఉన్న లాల్ గడి మలక్ పేట్ జెడ్పీహెచ్ స్కూల్, అలియాబాద్ ఎంపీపీఎస్ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా శేరిలింగంపల్లి జోన్ లోని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీల లోని ఇంద్రేశం ఎంపీయుపీ స్కూల్, ఇస్నాపూర్ జెడ్పీహెచ్ స్కూల్, చిట్కూల్ ఎంపీపీ స్కూల్ లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. సైబరాబాద్ సీపీ వెంట డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్., శేరిలింగంపల్లి డిసిపి సీ. హెచ్. శ్రీనివాస్, ఐపీఎస్., కుత్బుల్లాపూర్ ఇన్ ఛార్జ్ డిసిపి సాయి మనోహర్, ఎస్బీ డిసిపి సుధీంద్ర, క్రైమ్స్ డిసిపి ముత్యం రెడ్డి, డబ్ల్యు అండ్ ఎస్ డబ్ల్యూ డిసిపి సృజన కరణం, పీడీ సెల్ ఏడీసీపీ సత్యనారాయణ, కుత్బుల్లాపూర్ ఏడీసీపీ పురుషోత్తం, శేరిలింగంపల్లి ఏడీసీపీ ఉదయ్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఏసీపీ బాల గంగి రెడ్డి, మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ కుమార్, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే భార్య డిజైనర్ స్టోర్‌లో చోరీ

### స్టోర్ ఉద్యోగి పనే అని గుర్తించిన పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి సతీమణి అనుశ్రీ రెడ్డి నిర్వహిస్తున్న డిజైనర్ స్టోర్‌లో జరిగిన చోరీ కేసును బంజారాహిల్స్ పోలీసులు ఛేదించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ఎన్‌బీటీ నగర్‌లో ఓ డిజైనర్ స్టోర్‌ను అనుశ్రీ రెడ్డి నిర్వహిస్తున్నారు. ఈనెల 6న ఆ స్టోర్‌లో ఓ చోరీ జరిగింది. ఈ స్టోర్‌లో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న అమినుల్ హక్(38) ఈ చోరీకి పాల్పడ్డాడని పోలీసులు గుర్తించారు. అస్సాంకు చెందిన ఈ నిందితుడు కొన్ని నెలలుగా స్టోర్‌లో నమ్మకంగా పనిచేస్తున్నాడు. ఈ నెల 6న రాత్రివేళ పక్కా ప్రణాళికతో స్టోర్‌లోకి ప్రవేశించిన నిందితుడు.. సీసీటీవీ కెమెరాలకు చిక్కకుండా కిటికీ గుండా లోపలికి వెళ్లాడు. అక్కడ స్క్రూడ్రైవర్ సాయంతో లాకర్ తెరిచి రూ.2.43 లక్షల నగదును చోరీ చేశాడు. దోచుకెళ్లిన ఆ సొమ్మును తన ఇంట్లోని డస్ట్‌బిన్‌లో దాచాడు. మరుసటి రోజు ఉదయాన్నే డ్యూటీకి వచ్చిన అమినుల్ హక్.. స్టోర్‌లో దొంగలు పడ్డారంటూ హడావుడి చేశాడు. సీసీటీవీ కెమెరాల్లో స్పష్టమైన ఆధారాలు లేకపోవడంతో పోలీసులు, క్లూస్ టీమ్ రంగంలోకి దిగింది. కిటికీ వద్ద లభించిన బూట్ల ముద్రలు కీలక ఆధారంగా నిలిచాయి. ఆ షూస్ ముద్రలు పూర్తిగా మ్యాచ్ కావడంతో అమినుల్ హక్ గుట్టు రట్టయ్యింది. విచారణలో చోరీ చేసినట్లు అమినుల్ హక్ అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన బంజారాహిల్స్ పోలీసులు.. అతడి నుంచి రూ.2.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

## పోలీసుల తీరుపై జగ్గారెడ్డి ఆగ్రహం

**సంగారెడ్డి,ఫిబ్రవరి11 :** పట్టణంలోని 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న సీఐ.. 34 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గల్ల పట్టుకున్నారని ఆరోపిస్తూ సీనియర్ నేత జగ్గారెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. పోలింగ్ ఆపేస్తామంటూ బూత్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, జగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి రిగ్గింగ్‌కు సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి మండిపడ్డారు. సీఐని సస్పెండ్ చేయకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించారు.

## బైక్‌పై తిరుగుతూ మంత్రి వివేక్ ప్రచారం

**మంచిర్యాల, ఫిబ్రవరి 11 :** రాజ్యాంగ విలువను, ఎన్నికల విధానాలను రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ తుంగలో తొక్కారు. పోలింగ్ జరుగుతున్న బుధవారంసైతం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మున్సిపాలిటీలో ప్రచారం చేశారనే విమర్శలు వచ్చాయి. చెన్నూర్ 4, 5 బూత్ లలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభ్యర్థులతో కలిసి బైక్ పై తిరుగుతూ ప్రచారం చేశారు. దాదాపు మధ్యాహ్నం 12.25 గంటల సమయంలో బైక్ పై తిరుగుతూ ప్రచారం చేస్తూ కెమెరా కంటపడ్డారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు నిమిషాల వ్యవధిలోనే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నిన్న సైతం ఇదే తరహాలో క్యాతన్ పల్లి, చెన్నూరు మున్సిపాలిటీ ల్లో తిరుగుతా మంత్రి ప్రచారం చేశారు. దీంతో రాజ్యాంగం, ఎన్నికల కమిషన్ అంటే గౌరవం లేదా.. విచ్చల విడిగా ఇలా అధికార దుర్వినియోగం చేయడం ఏంటి.. మంత్రి స్థాయి వ్యక్తి ఇలా చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంత జరుగుతున్న అడ్డుకోవాల్సిన ఎన్నికల సంఘం, అధికారుల తీరు పై విమర్శలు వెల్లువెత్తాయి. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలోని ఓ పోలింగ్ కేంద్రం దగ్గర బీఆర్‌ఎస్ ఏజెంట్ శ్రీనివాస్ గౌడ్‌ను పోలీసులు దౌర్జన్యంగా బయటికి ఈడ్చుకెళ్లారు.

## చెదురుమొదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** చెదురుమొదురు ఘటనలు మినహా తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 5 గంటల లోపు క్యూలో నిలుచున్న వారికి మాత్రమే అధికారులు ఓటు వేసే అవకాశం ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు పోలింగ్ పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని, 16న కార్పొరేషన్ల మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపాలిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక ఉంటుందని అధికారులు తెలిపారు. తుది ఓటింగ్ శాతం రాత్రికి వెల్లడి కానుంది. ఎన్నికల బరిలో ఉన్నవారి అదృష్టం ఈనెల 13న తేలబోతుంది. ఈ నెల 13న ఉదయం 8 గంటలకు 136 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక ఉంటుంది.:ఉదయం 7 గంటలకే ప్రారంభమైన ఓటింగ్ పక్రియ, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. అక్కడక్కడా స్వల్ప ఉద్రిక్తతలు మినహా రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. రద్దీ ఎక్కువగా ఉన్న చోట టోకెన్లు జారీ చేసి ఓటింగ్ నిర్వహిస్తున్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీల్ చేస్తారు. పోలీసుల భారీ భద్రత నడుమ వీటిని నిర్దేశించిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికే దాదాపు 62శాతం పైగా పోలింగ్ నమోదైంది.

**Public Notice**

**ఒరిజినల్ భూమి పత్రాలు పోయినవి**

హైదరాబాద్, న్యూ బోయిన్‌పల్లి, మలాని కాలనీ నివాసి, టెల్కర్ ప్రేమలత కుమార్తె అయిన గుల్వానే మమత హేమంత్ (45) అను నేను ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ నెల (జనవరి) 04వ తేదీ సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో నేను నగరంలో ప్రయాణిస్తుండగా నా బ్యాగ్ పోయింది. ఆ బ్యాగ్‌లో నా భూమికి సంబంధించిన అసలు సేల్ డీడ్ పత్రాలు ఉన్నాయి.

**పోగొట్టుకున్న పత్రాల వివరాలు:**
- డాక్యుమెంట్ నంబర్: 393/2012
- రిజిస్ట్రేషన్ తేదీ: 26-03-2012
- స్థలం: మలాని కాలనీ, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్, హైదరాబాద్.
- విస్తీర్ణం: 365 చదరపు గజాలు.

పైన పేర్కొన్న అసలు సేల్ డీడ్ మరియు దానికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికినట్లయితే లేదా వాటి సమాచారం తెలిసినట్లయితే, దయచేసి వెంటనే కింద తెలిపిన చిరునామాకు గానీ లేదా ఫోన్ నంబర్‌కు గానీ సమాచారం అందించవలసిందిగా కోరుచున్నాను. సమాచారం అందించిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.

**చిరునామా:**
**గుల్వానే మమత హేమంత్,**
**ఫ్లాట్ నం. +1, మలాని కాలనీ,**
**న్యూ బోయిన్‌పల్లి, హైదరాబాద్, తెలంగాణ.**
**సంప్రదించాల్సిన నెంబర్**
**టి. ప్రేమలత**
**ఫోన్ నంబర్: 9642364881**

# స్పీకర్ సమవర్తిగా ఉండాల్సిందే !



**స్పీకర్ సమర్థతపైనే చట్టసభల్లో సమస్యలపై చర్చ సాగుతుంది. స్పీకర్ నిజాయితీగా, నిష్పక్షపాతంగా ఉంటే చట్టసభల్లో అర్థవంతమైన చర్చకు అవకాశం ఉంటుంది. అసెంబ్లీ అయినా పార్లమెంట్ అయినా ఇదే వర్తిస్తుంది. గతంలో కాంగ్రెస్ హయాలో అయినా, ఎన్‌డిఏ హయాంలో అయినా చర్చలు ఫలవంతంగా సాగేవి. ప్రతిపక్షాలు ఎక్కడ ఏ సమస్యలు లేవనెత్తుతాయా అని ప్రభుత్వాలు ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచేసేవి. నీలం సంజీవరెడ్డి, బలరాం- జాకడ్, శివరాజ్ పాటిల్, పిఎ సంగ్మా ఇలా ఎందరో స్పీకర్లు సభాధ్యక్షస్థానానికి వన్నె తెచ్చారు. సమస్యలపై చర్చలకు అవకాశం ఇచ్చారు. ఇక్కడ చర్చలంటే విపక్షం నుంచే అన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే గత 12 ఏళ్లుగా అంటే..మోడీ అధికారం చేపట్టిన తరవాత చట్టసభల్లో అర్థవంతమైన చర్చలకు ఆస్కారం లేకుండా పోయింది. అర్థవంతం కాదు కదా అసలు చర్చలకే ఆస్కారం కనిపించడం లేదు.**

విపక్షం నుంచి ఎవరైనా లేస్తే..స్పీకర్ మైక్ కట్ చేయడం అలవాటు చేసుకున్నారు. అలాంటప్పుడు ప్రజలు ఏమనుకుంటున్నారో ఎలా తెలుస్తుంది. నిజానికి ప్రభుత్వమే చర్చలను ఆహ్వానించాలి. తమ పాలనా విధానాలపై ప్రజల్లో ఎలాంటి ప్రభావం ఉందో అన్నది తెలుసు కోవాలి. అయితే మోడీ ప్రభుత్వం సమస్యలపై చర్చలను కోరుకోవడం లేదు. చర్చ జరిగితే సమాధానం ఇవ్వడం, ఇరుకున పడడం ప్రభుత్వానికి ఇష్టం లేదన్నది సుస్పష్టం. ఇకపోతే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఏదేని సమస్యపై లేచి నిలబడితే మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు. కనీసం విపక్షనేతకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన కూడా లేకుండా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా వ్యవహరిస్తున్నారు. సమావేశాలను ప్రత్యక్షం గా వీక్షించే వారికి ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఒకవేళ రాహుల్ విపక్ష నేతగా సరిగా మాట్లాడకపోతే దానికి సమాధానం ఇవ్వడానికి ప్రభుత్వానికి అవకాశం ఉంటుంది. కానీ అసలు మైక్ ఇచ్చీ ఇవ్వనట్లుగా స్పీకర్ వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాల్సి వచ్చింది. ఇది కూడా మంచిదే. ఎలాగూ బలం ఉంది. స్పీకర పదవికి వచ్చిన ఢోకా లేదు. కనీసంఈ సందర్భంగా అయినా పార్లమెంట్‌లో చర్చ సాగితే మంచిదే. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు మంగళవారంనాడు నోటీసులు ఇచ్చారు. నోటీసును లోక్‌సభ సెక్రటరీకి అందజేశారు. ఇండియా కూటమికి చెందిన 118 మంది ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేశారు.

సభలో మాట్లాడేందుకు విపక్ష నేతలకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదంటూ ఈ నోటీసు ఇచ్చారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, డీఎంకే పార్టీలు దీనికి మద్దతు పలుకగా, తృణమూల్ కాంగ్రెస్ ఇంతవరకూ సంతకం చేయలేదు. ఈ పక్రియను సమీక్షించనున్నట్టు టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై రాహుల్ గాంధీ సంతకం చేయలేదని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో స్పీకర్ తొలగింపు పిటిషన్‌పై ప్రతిపక్ష నేత సంతకం చేయడం సరైంది కాదని, రాహుల్ గాంధీ సంతకం చేయకపోవడానికి అదే కారణమని పేర్కొన్నాయి. కాగా, అవిశ్వాస తీర్మానం పరంగా లోక్‌సభలో బలాబలాలను చూసినప్పుడు లోక్‌సభలో అధికార పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. 293 మందితో మెజారిటీ సభ్యుల బలం వారికి ఉండగా, విపక్షాలకు 214 మంది సభ్యుల బలం ఉంది. బలాల సంఖ్య ఎలా ఉన్నా విషయం మాత్రం ప్రజలకు కూడా తెలుస్తుంది. పార్లమెంట్ సమావేశాలు ఎన్ని రోజులు జరిగినా మొక్కుబడిగా మమ అనిపిస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చ సాగడం లేదు. దేశంలో అవినీతి, అక్రమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అనేక సమస్యలు ఉన్నాయి. రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్ సమావేశాల్లో ఈ అంశాలను చర్చకు అవకాశం ఉంటుంది. కానీ విపక్షాలకు అలాంటి అవకాశం రావడం లేదు. కేవలం ప్రధాని పడికట్టు పదాలతో ఇచ్చే ఉపన్యాసమే ప్రధాన వార్తగా చలామణి అవుతుంది. వికసిత భారత్, ఆత్మనిర్భర భారత్ వంటి పడికట్టు పదాలు తప్ప దేశం పురోగతికి సంబంధించి న అంశాలపై చర్చలకు ఆస్కారం కలగడం లేదు. మాజీ ఆర్మీచీఫ్ నరవాణె ఆముద్రిత పుస్తకంలోంచి కొన్ని పదాలను ఉటంకిస్తూ రాహుల్ మాట్లాడాలనుకున్న అవకాశం దక్కలేదు.

ఒకవేళ ఆముద్రిత పుస్తకం ప్రస్తావన వద్దని చెప్పడం వేరు. కానీ అసలు మాట్లాడనీయక పోవడం సరికాదు. వాజ్‌పేయ్, పివి నరసింహారావు, రాజీవ్ గాంధీ, మన్మోహన్ సింగ్ ప్రధానులుగా ఉన్న సమయాల్లోనూ పార్లమెంటులో అర్థవంతమైన చర్చలు సాగేవి. కానీ ప్రస్తుతం చర్చలకు ఆస్కారం లేకపోవడంతో విపక్ష ఎంపిలు పోడియం వద్ద ఆందోళన చేయడం, సభనుంచి బయటకు రావడం రివాజుగా మారింది. ఇకపోతే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ విషయంలో ఎందుకనో విపక్షం వైపు చూడడం మానేశారు. విపక్ష సభ్యుల ప్రస్తావనలకు స్పందించడం లేదు. ఇది ఆయన ఆత్మ పరిశీలన చేసుకోవాలి. అంతేకాదు...తన వైఖరిని మార్చుకుని ప్రజలకోసం పార్లమెంట్ అన్నది గుర్తించాలి. ఇకపోతే అవిశ్వాస తీర్మానంపై చర్చ పూర్తయ్యేంత వరకూ సభకు దూరంగా ఉండాలని ఓంబిర్లా నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్‌ను తొలగించాలంటూ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ సెక్రటరీకి కాంగ్రెస్ నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఓం బిర్లా ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీకి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని, నిలదీసిన 8 మంది ఎంపీలపై సస్పెన్స్ వేటువేశారని విపక్షాలు తప్పుపడు తున్నాయి. విపక్షానికి చెందిన మహిళా ఎంపీలు దాడికి ప్రయత్నిస్తారనే సమాచారంతో ప్రధాని ప్రసంగం లేదని సభాపతి స్థానం నుంచి ఓం బిర్లా ప్రకటించడం, మహిళా ఎంపీలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిన బీజేపీ ఎంపీపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ క్రమంలో 118 మంది సభ్యుల సంతకాలతో మంగళవారం ఉదయం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు విపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశాయి. కాగా, దీనికిముందు అధికార పార్టీకి తలొగ్గి తమపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ ఓం బిర్లాకు రాసిన లేఖలో కాంగ్రెస్ మహిళా ఎంపీలు నిరసన తెలిపారు. ఇవన్నీ ఎలా ఉన్నా పార్లమెంటులో చర్చలు జరగాలి. అర్థవంతమైన చర్చలకు ఆస్కారం ఉండాలి. స్పీకర్ అలాంటి అవకాశం కల్పించాలి. గతంలో పనిచేసిన స్పకీర్లు అనుసరించిన తీరును నడవాలి. అప్పుడే పార్లమెంట్ సమావేశాలకు అర్థం ఉంటుంది. అధికార బిజెపి కూడా ప్రజాస్వామ్యబద్దంగా పనిచేయడానికి సిద్దంగా ఉండాలి. గత పదేళ్లతో పోలిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి బలం గణనీయంగా పడిపోయింది. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో కొనసాగుతున్నామని గుర్తించాలి.

# ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో కుచ్చుటోపీ

- 500 మంది నుంచి 270 కోట్లు వసూళ్లు
- ఎనిమిదేళ్లయినా అతీగతీ లేని ప్రాజెక్టు
- ఫిర్యాదుతో పోలీసుల కేసు నమోదు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** ఊదరగొట్టే ప్రకటనలు ఇస్తారు. అతి తక్కువ ధరకే ప్లాట్స్ ఇస్తామంటూ ఊరిస్తారు. తీరా చూస్తే.. డబ్బులు కట్టించుకుని ఏళ్లకు ఏళ్లు.. వారి చుట్టూ తిప్పించుకుంటారు. డబ్బులు చేతిలో పడ్డాక.. ఉసూరమనిపిస్తారు. అంతా రియల్ మాయాజాలం. ఆ రియల్ మాయకు అమాయకులైన జనం మోసపోతున్నారు. హైదరాబాద్‌లో ఇలాంటి రియల్ మోసాలు చాలా జరుగుతున్నాయి. తాజాగా అలాంటి చీటింగ్ గ్యాంగ్ ఒకటి వెలుగులోకి వచ్చింది. కూకట్‌పల్లిలో వైట్ వాటర్ పేరుతో ప్లాట్స్ అమ్ముతున్నామని ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో మోసం చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దాదాపు 500 మంది నుంచి 270 కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయి. పదేళ్ల నుంచి ప్రాజెక్టు పేరు చెప్పి డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వైట్ వాటర్ కన్స్ట్రక్షన్ యజమాని అజయ్‌తో పాటు పలువురుపై కేసుల నమోదు చేసి సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ కేసు మూసాపేట పవర్ నగర్ కాలనీకి చెందిన భోగాడి సుజాత ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేశారు పోలీసులు. ఐతే ఈ కేసులో ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదు. వైట్ వాటర్స్ యాజమాన్యానికి కొనుగోలు కోసం ఫిర్యాదుదారు సుజాత సుమారు 80 లక్షల రూపాయలు చెల్లించారు. కానీ ఆమె తీసుకున్న బ్యాంకులో తనఖా పెట్టినట్లు ఆమెకు తెలిసింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మరోవైపు వైట్ వాటర్స్ యాజమాన్యం.. కొనుగోలుదారులకు స్వాధీనం చేయకుండా ఆలస్యం చేస్తున్నారు. ఇప్పటికే డబ్బు చెల్లించి పదేళ్లు గడిచిపోయిందని బాధితులు చెబుతున్నారు. పైగా ధరలు పెంచడం, ఒకే ప్లాట్‌ను పలుమార్లు అమ్మారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో వైట్ వాటర్స్ యాజమాన్యంపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిజానికి ఈ వైట్ వాటర్స్ ప్రాజెక్టు వెంచర్‌ను 2018లో ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు కేవలం టవర్స్‌లో నిర్మాణం కొంతమేర పూర్తయింది. అ, ఆ టవర్ల బేస్‌మెంట్లు మాత్రమే పూర్తి చేశారు. ఇ, ఈ టవర్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాలేదు. నమోదు గడువు ఇప్పటికే రెండుసార్లు పొడిగించగా.. ఈ ఏడాది జూన్‌లో అది కూడా ముగియనుందని కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. గతంలో డిసెంబర్ 2024, డిసెంబర్ 2025లో హ్యాండ్ ఓవర్ చేస్తామని చెప్పి మోసం చేసినట్లు బాధితులు చెబుతున్నారు. వైట్ వాటర్స్ యజమాని అజయ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుకున్నారు.

ముందస్తుగా డబ్బులు చెల్లిస్తే అతి తక్కువ ధరకే ఇస్తామంటూ అందరిని నమ్మించాడు అజయ్. దీంతో ప్రీ లాంచ్ ఆఫర్ పేరుతో వచ్చిన దీనిని ఆకర్షితులై చాలా మంది పెట్టుబడులు పెట్టారు. ఇప్పటి వరకు 270 కోట్ల రూపాయలకు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇక్షచి పోలీసులకి ఇప్పటివరకు వందమంది కాంటా క్ట్ అయ్యారు. మరోవైపు పోలీస్ కేసు నుంచి తప్పించుకునేందుకు అజయ్ కొత్త నాటకానికి తెర తీసినట్టు బాధితులు చెబుతున్నారు. తమకు డబ్బులు ఇస్తామని చెప్పి నమ్మించి.. కొందరి చేత కేసులు విత్ డ్రా చేయించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

# కరీంనగర్‌లో ఓటేసిన బండి దంపతులు

- ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్‌కు చిత్తశుద్ధి లేదని వ్యాఖ్య
- కెసిఆర్‌పై చర్యలకు వెనకాడుతున్నారని విమర్శ



**కరీంనగర్, ఫిబ్రవరి 11 :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జ్యోతినగర్ ఎస్ఆర్ హైస్కూల్లో కుటుంబ సభ్యులతో కలిసి కేంద్రమంత్రి బండి సంజయ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బండి సంజయ్ మరోసారి విరుచుకుపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేస్తున్నారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై రేవంత్ రెడ్డివి ఊకదంపుడు ప్రసంగాలు మాత్రమే అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు రేవంత్ భయపడుతున్నారా? కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోరా? అని మంత్రి ప్రశ్నించారు. అంతేకాకుండా.. రేవంత్ రెడ్డికి రాజకీయాల మీద ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. యూరియా పక్కదారి పడుతున్నా ఏమీపట్టడం లేదా అని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ నేతలు బ్లాక్‌లో యూరియా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కేంద్రాన్ని విమర్శించడం తప్ప.. రాష్ట్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు ద్రోహి అంటూ వ్యాఖ్యానించారు. టీవీల ముందు తప్ప.. రైతుల పట్ల బాధ్యత లేదా అని, యూరియా మీద కనీసం సమీక్ష చేయరా అని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో రైతులు గోసపడారని మంత్రి అన్నారు.

# మూసీ ప్రాజెక్టులో కీలక అడుగు

## భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మూసీ అభివృద్ధికి భూసేకరణ పక్రియను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం ఫేజ్ ఏ1లో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్లు, ఫేజ్ ఏ2లో ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్లు పరిధిలో అధికారులు భూసేకరణ చర్యలు చేపట్టనున్నారు .హైదరాబాద్, గోల్కొండ మండలం, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో భూముల సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. సుమారు 50 ఎకరాలకు పైగా భూమి సేకరించేందుకు పక్రియ ప్రారంభమైంది. భూ యజమానులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఆయా యజమానులు తమ హక్కుల పత్రాలు పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు నిర్దేశిత సమయంలో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏమైనా అభ్యంతరాలంటే నిర్ణీత సమయంలో తెలియజేయాలని అధికారులు సూచించారు. సర్వే నంబర్లు, గ్రామాల వారీగా పూర్తి జాబితాను కూడా ప్రకటించారు. నిబంధనల ప్రకారం.. ఈ భూసేకరణ పక్రియను అధికారులు చేపట్టనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మూసి అభివృద్ధి పనులు దశలవారీగా కొనసాగనున్నాయి. మొత్తం గండిపేట నుంచి గౌరెల్లి వరకు సుమారు 55 కిలోమీటర్ల పరిధిలో, 14 మండలాలు, 46 గ్రామాల్లో మూసీ అభివృద్ధి జరగనుంది.

# మున్సిపల్ ఎన్నికల్లో స్వల్ప ఉద్రిక్తతలు

- పలుచోట్ల పరస్పర ఘర్షణలు
- దొంగ ఓట్ల ఆరోపణలతో పోలీసుల జోక్యం



**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. పోలింగ్ కొనసాగుతున్న వేళ పలు జిల్లాల్లో స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్యకర్తల మధ్య ఘర్షణలు, నినాదాలు, దొంగ ఓట్ల యత్నాలు వంటి ఘటనలు వెలుగుచూశాయి. పోలీసులు వేగంగా స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మహబూబాబాద్ పట్టణంలోని 32, 33 పోలింగ్ బూత్‌ల వద్ద స్వల్ప ఘర్షణలు జరిగాయి. 14వ వార్డులో పోటీలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ఘర్షణకు దిగాయి. కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత పెరిగింది. సమాచారం అందుకున్న వెంటనే భారీగా పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు 14వ వార్డులో భారీగా పోలీసులను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో బుధవారం ఉదయం 9 గంటల వరకు 14 శాతం పోలింగ్ నమోదైంది. నగరంలోని కోటగల్లీ 25వ డివిజన్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు.. వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పెద్ద ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించారు. బోధన్ పట్టణంలో ఎంఐఎం, బీఆర్ఎస్ కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేస్తూ ఉద్రిక్త వాతావరణం సృష్టించారు. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. నిజామాబాద్ జిల్లాలోని రాకాసిపేట్ పోలింగ్ కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో వారిని అడ్డుకుని కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలోని 15వ వార్డులోనూ స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఓటర్లను ప్రలోభ పెడుతున్నారంటూ బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది.బీజేపీ, బీఆర్ఎస్ ఇరువర్గాల మధ్య బాహాబాహీ చోటుచేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని అధికారులు తెలిపారు.సంగారెడ్డి జిల్లాలోని 28వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓ వ్యక్తి దొంగ ఓటు వేయడానికి ప్రయత్నించాడు. అప్పటికే మరో పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన సదరు వ్యక్తి.. 28వ వార్డులో మరోసారి ఓటు వేసేందుకు వచ్చినట్లు గుర్తించారు. అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పోలింగ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. ఆ వ్యక్తి చేతి వేలికి సిరా గుర్తువేసి పోలింగ్ కేంద్రం నుంచి పంపించారు. చట్టపరంగా ఆ వ్యక్తిపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారులు తెలిపారు.

# బోధన్‌లో దొంగ ఓట్లేసేందుకు యత్నం

## ఇద్దరిని గుర్తించి పట్టుకున్న పోలీసులు

**నిజామాబాద్, ఫిబ్రవరి 11 :** రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో అక్కడక్కడా కొందరు దొంగ ఓట్లు వేసేందుకు వచ్చి పట్టుబడ్డారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం రాకసిపేట గోశాలలో దొంగ ఓట్లు వేసేందుకు ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించారు. బూత్ నెంబర్ 24, 78 లలో ఇతరుల పేరుతో ఓటు వేసేందుకు ఇద్దరు యువకులు వచ్చారు. తప్పుడు గుర్తింపు పత్రాలతో పోలింగ్ కేంద్రంలోకి రావడంతో అధికారులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. దీనితో బోధన్ పట్టణం 21వ వార్డు పరిధిలోని అరీసా సాగర్ నగర్ లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఒకే చోట బీఆర్ఎస్, ఓఎట రెండు పార్టీల కార్యకర్తలు గుమ్మిగూడారు. ఒక్కసారిగా పరస్పర నినాదాలు చేపట్టారు. దాంతో ఆ ప్రాంతమంతా టెన్షన్ వాతావరణం నెలకొంది. రెండు పార్టీ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. ఒకే చోట బిఆర్ఎస్, ఎంఐఎం కార్యకర్తలు గుమిగూడి పరస్పర నినాదాలు చేశారు. దీనితో ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టారు.

# మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

- 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ సర్వీసులు
- శ్రీశైలం, వేములవాడ, ఏడుపాయల తదితర క్షేత్రాలకు

**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. శివరాత్రి సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి పండుగ ఉండటంతో.. ఈనెల 14 నుంచి 16 వరకు ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71 స్పెషల్ సర్వీసులు నడవనున్నాయి. అదేవిధంగా కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్‌లు, తాగునీటితోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15వ తేదీ నుంచి 17 తేదీ వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది. బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో) రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం.. మహిళలకు యథావిధిగా ఉచిత రవాణా సదుపాయం అమల్లో ఉంటుంది. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్ ను లిలిలి.బిణబసబిఇశిబీబ.తిని వెబ్‌సైట్లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-234500332లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# మారిన గుర్తుల క్రమసంఖ్య

## ఆందోళన వ్యక్తం చేసిన అభ్యర్థులు

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11 :** మున్సిపల్ ఎన్నికల్లో గందరగోళం నెలకొంది. మహబూబ్‌నగర్‌లోని 45వ డివిజన్‌లో ఓటర్లకు ఇస్తున్న బ్యాలెట్ పేపర్లపై సీరియల్ నంబర్లు, గుర్తులు తారుమారు కావడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేసారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అధికార యంత్రాంగం ఇచ్చిన బ్యాలెట్ నమూనా ఒకలా ఉంటే.. పోలింగ్ రోజు మరోలా ఇస్తున్నారని వాపోయారు. ముందుగా ఇచ్చిన నమూనా బ్యాలెట్‌లో ముందు ప్రధాన పార్టీల గుర్తులు.. ఆ తర్వాత జనసేన, ఇతర పార్టీల గుర్తులను ఇచ్చారు. కానీ అనూహ్యంగా పోలింగ్ రోజు ఇచ్చిన బ్యాలెట్‌లో జనసేన పార్టీకి ఒకటో నంబర్ ఇచ్చారు. దీంతో ప్రధాన పార్టీల గుర్తులన్నీ మారిపోయా యి. ఎన్నికలు ప్రారంభమయ్యాక ఇది గమనించిన అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. దీంతో 20 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది.అభ్యర్థుల ఆందోళనతో రంగంలోకి దిగిన అధికారులు అభ్యర్థులతో చర్చించారు. సమన్వయంతో ఓటింగ్ పక్రియను పునఃప్రారంభించారు.



## పేట మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాదిస్తుంది

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట మున్సిపాలిటీ కి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత 46వ వార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ లతో కలిసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందని అన్నారు. సూర్యాపేట పట్టణంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారని, ప్రతి వార్డులో పార్టీ విజయపథంలో ముందుకు దూసుకుపోతుందని, 40 స్థానాలను గెలుస్తుందని వారు అన్నారు. మాజీ మంత్రి ,పదేళ్ల పాటు పరిపాలన చేసిన గుంటకండ్ల జగదీశ్ రెడ్డి రెడ్డి సూర్యాపేటకు చేసిందేమిలేదని, కాంగ్రెస్ పార్టీ వస్తే సూర్యాపేట అభివృద్ధి చెందుతుందని,ప్రజలు అర్థం చేసుకున్నారని వారు అన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటిస్తుందని, బీసీలకు 48% ఎస్సీలకు 9 సీట్లు, ముస్లింలకు ఆరు సీట్లు ఇచ్చిందని మున్సిపల్ చైర్మన్ పదవి ఆర్యవైశ్య మహిళకు ఇవ్వడం జరిగిందని అన్నారు. 13 న జరిగే కౌంటింగ్ తర్వాత కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున సంబరాలు జరుగుతుందని తెలిపారు.



## సీఎం కప్ జిల్లా బ్యాట్మెంటన్ విజేత మాన్య

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** సీఎం కప్ క్రీడా పోటీలలో భాగంగా కామారెడ్డి జిల్లా బ్యాట్మెంటన్ టోర్నమెంట్ విభాగంలో క్రీడాకారిణి గందే. మాన్య/ప్రశాంత్ కుమార్( టీచర్ ) అద్భుత ప్రతిభ ని ప్రదర్శించి ప్రథమ విజేత కామారెడ్డి జిల్లా సింగిల్స్ అండర్ 19 బాలికల విభాగం మిక్సడ్, డబుల్స్ విజేతగా రాష్ట్ర స్థాయి సీఎం కప్ కి జిల్లా సెలెక్ట్ అయిందుకు కామారెడ్డి బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోచ్ సందీప్ గౌడ్, ఎస్ ఆర్ ఆర్ స్కూల్ యాజమాన్య ఉపాధ్యాయ బృందం, విద్యార్థి తల్లిదండ్రులు జ్యోత్స్నప్రశాంత్ లతో పాటు స్వప్నలోక్ కాలనీ వాసులు, బంధువులు, శ్రేయోభిలాషులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.



## పుట్టినరోజును అనాధ పిల్లల మధ్య జరుపుకోవడం సంతోషాన్ని ఇచ్చింది

- మాజీ ఎంపీటీసీ లాయర్ బైకని ప్రభాకర్ యాదవ్
- చనిపోయిన మిత్రుని కుటుంబానికి లక్ష ఆర్థిక సహకారం
- అనాధ పిల్లల ఆశ్రమానికి 50వేల రూపాయల డొనేషన్

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలకు విలువనివ్వని ఈ రోజులలో, పేద ప్రజల గురించి అనాధల గురించి ఆలోచించి వారిని అక్కున చేర్చుకునే గుణమున్న నాయకుడు బైకని ప్రభాకర్ యాదవ్. ప్రతి సంవత్సరము తన పుట్టిన రోజును అనాధ పిల్లల మధ్య పేద ప్రజల మధ్య జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. హంగు ఆర్భాటాలు లేకుండా వృధా ఖర్చు చేయకుండా ఆడంబరాలకు అయ్యే ఖర్చులను అనాధ పిల్లల చదువుల కోసం ఉపయోగిస్తూ, ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడు బైకని ప్రభాకర్ యాదవ్. తెల్లాపూర్ గ్రామంలో తన స్నేహితుడు మరణించిన సంగతి తెలుసుకున్న ప్రభాకర్ యాదవ్ ఆ కుటుంబానికి ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ప్రభాకర్ యాదవ్ గతంలో తెల్లాపూర్ ఎంపీటీసీ గా ప్రజలకు సేవల నందించిన ప్రజానాయకుడు. మంగళవారం రోజు తెల్లాపురం జిఎస్ఎంసి పరిధిలోని జ్యోతిరావు పూలే కాలనీలో తన పుట్టినరోజు సందర్భంగా అనాధ పిల్లలకు పేదలకు కడుపునిండా చక్కని భోజనం పెట్టి, ఆ సంస్థకు 50 వేల రూపాయల ఆర్థిక సాయం కూడా అందించిన ప్రభాకర్ యాదవ్. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడానికి స్థానిక కాలనీ ల ప్రజలతో పాటు స్నేహితులు వివిధ పార్టీల నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



## మునిసిపల్ ఎన్నికలను పరిశీలించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ పట్టణంలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలైన కొత్తగాడి, అల్లంపల్లి ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌లను వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, పోలీస్ బందోబస్తును ఎస్పీ సమీక్షించారు. ఓటింగ్ ప్రశాంతంగా పూర్తి అయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని,సంబంధిత పోలీస్ అధికారులకు సూచనలు జారీ చేశారు. జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యేవరకు ఎన్నికల కోడ్ ఉంటుంది అని, ప్రతి ఒక్కరు ఎంసీసీ నిబంధనలు పాటించాలని ఎస్పీ ఇట్టి సందర్భంగా తెలియజేయడం జరిగింది.






## విజ్ఞాన్ గ్రామర్ పాఠశాలలో
# అట్టహాసంగా ఫుడ్ ఫెస్టివల్

- ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ కుర్ర శాలిని శ్రీకాంత్ గౌడ్
- గౌరవ అతిథులుగా రాజముద్ర దినపత్రిక ఎడిటర్ రావు నాగిరెడ్డి, ప్రైవేట్ పాఠశాలల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జే నాగరాజు, కరస్పాండెంట్ ఏ. ఉపేందర్ గౌడ్
- పాల్గొన్న వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం చాలా బాగుందని మాజీ కార్పొరేటర్ కుర్రశాలిని శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పీర్జాదిగూడ డివిజన్ పరిధిలోని పార్వతి నగర్ కాలనీ లో గల విజ్ఞాన్ గ్రామర్ స్కూల్ లో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కార్పొరేటర్ కుర్రశాలిని శ్రీకాంత్ గౌడ్, గౌరవ అతిథులుగా రాజముద్ర దినపత్రిక ఎడిటర్ రావు నాగిరెడ్డి, ప్రైవేట్ పాఠశాలల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జై నాగరాజు, పాఠశాల కరస్పాండెంట్ ఎ. ఉపేందర్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద సిద్ధం చేసుకున్న వివిధ రకాల రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటకాలను స్టాళ్లలో ప్రదర్శించారు. సాంప్రదాయ వంటకాలతో పాటు ఆధునిక ఆహార పదార్థాలను విద్యార్థులు ప్రదర్శించిన తీరు అతిథులను కనువిందు చేసింది. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని, ఇలాంటి కార్యక్రమాలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. ప్రతి వంటకంలో ఉండే పోషక విలువల గురించి విద్యార్థులు వివరించిన తీరును చూసి వారు అభినందించారు. పాఠశాల పరిసరాలు విద్యార్థుల కేరింతలు, రుచికరమైన వంటకాల ఘుమఘుమలతో సందడిగా మారాయి. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు శ్రీనివాస్, శ్రీకాంత్ శర్మ, కొండ రాజు, స్థానిక వాసి శ్రీశైలం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









## గ్రేటర్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్
# కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి బాధ్యతల స్వీకరణ

**మల్కాజ్గిరి, రాజముద్ర న్యూస్:** గ్రేటర్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నియమితులైన ఆయన, బుధవారం కార్యాలయంలో లాంఛనంగా బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమిషనర్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని 3 జోన్లు, 14 సర్కిల్లు, 74 వార్డులలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ప్రతి వార్డులో పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్లు, సర్కిల్ స్థాయి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు, ఫిర్యాదుల పరిష్కార వేదికలను బలోపేతం చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. నగర సుందరీకరణ, రహదారుల మరమ్మతులు మరియు డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలపై పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను స్వయంగా తెలుసుకుంటానని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ జోన్ల కమిషనర్లు, 14 సర్కిళ్ల ఉప కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





## ఆమె మాట్లాడిన తీరుబాగోలేదు..
# అందుకే టారిఫ్‌లు పెంచాను
### : స్విస్ నేతపై ట్రంప్

**యూఎస్ :** ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై సుంకాల మోతమోగిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. స్విట్జర్లాండ్‌పై టారిఫ్‌లు పెంచడం వెనక విచిత్రమైన కారణాన్ని చెప్పారు. ఆ దేశానికి చెందిన నేత మాట్లాడిన తీరు తనకు నచ్చలేదని.. అందుకే అదనంగా మరో తొమ్మిది శాతం పెంచానని చెప్పారు. ఓ మీడియా సంస్థ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "స్విట్జర్లాండ్ పై 30 శాతం టారిఫ్‌లు విధించాను. అసలు ఆ మొత్తం చాలా తక్కువ. సుంకాల విధింపు తర్వాత నాకు ఒక ఎమర్జెన్సీ కాల్ వచ్చింది. ఆ దేశ ప్రధాని కాల్ చేశారని అనుకున్నాను. కానీ, కాదు వేరొకరు. అప్పుడు ఆ నేత మాట్లాడిన తీరు నాకు నచ్చలేదు. 'సర్.. మాది చాలా చిన్నదేశం. ఈ సుంకాలు మేం భరించలేం' అని అన్నారు. మీది చిన్నదేశమే అయినా అమెరికాతో జరుపుతోన్న వాణిజ్యంలో 42 బిలియన్ డాలర్ల మిగులు ఉందని చెప్పాను. అయినా మాది చిన్నదేశం అంటూ ఆమె పదేపదే అదే మాట చెప్పారు. నాకు ఆమె మాట్లాడిన తీరు నచ్చలేదు. అందుకే సుంకాలు తగ్గించడానికి బదులు.. 30 శాతం నుంచి 39 శాతానికి పెంచాను. ఎలాంటి సుంకాలు చెల్లించకుండా మా దేశానికి స్విస్ తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే, స్విస్ ఫెడరల్ కౌన్సిల్ సభ్యురాలైన కరిన్ కెల్లర్ సట్టర్ నుంచి ట్రంప్‌నకు ఈ ఫోన్ కాల్ వచ్చింది.

## అమెరికా మా దేశాన్ని టాయిలెట్ పేపర్ కంటే
# ఘోరంగా చూసింది : ఆసిఫ్ ఖవాజా



**పాకిస్థాన్ :** పాకిస్థాన్ రక్షణ మంత్రి ఆసిఫ్ ఖవాజా అమెరికాపై తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికా తన రాజకీయ ప్రాధాన్యాలు, అవసరాలు, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం తమ దేశాన్ని వాడుకొందని అన్నారు. తర్వాత తమను టాయిలెట్ పేపర్ కంటే ఘోరంగా తీసిపారేసిందన్నారు. అఫ్గానిస్థాన్ విషయంలో 1999 తర్వాత అమెరికాతో చేతులు కలపడం తాము చేసిన పెద్ద తప్పిదమని అన్నారు. దీనివల్ల దేశం చాలా నష్టపోయిందని.. దాని పర్యవసానాలను ఇప్పటికీ అనుభవిస్తోందని వాపోయారు. 1999లో అప్పటి పాక్ సైన్యాధిపతి జనరల్ పర్వేజ్ ముషారఫ్ నేతృత్వంలోని సైన్యం.. ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కూల్చేసి అధికారాన్ని చేజిక్కించుకుందని ఆసిఫ్ ఖవాజా అన్నారు. 2001 తర్వాత అమెరికా మద్దతుతో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి తాలిబన్లకు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. అయితే, తాలిబన్లు తిరిగి తమపై హింసకు పాల్పడ్డారన్నారు. తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు అగ్రరాజ్యం తమకు ఎటువంటి సహాయం చేయలేదని ఆరోపించారు.



# వందే భారత్ ఛార్జీలు..
# చైనా, జపాన్‌ల కన్నా తక్కువే
### రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ :** వందే భారత్ ఏసీ చైర్ కార్‌లో ఛార్జీలు అందుబాటు ధరలోనే ఉన్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 300-400 కిలోమీటర్ల మధ్య ప్రయాణానికి కిలో మీటరుకు దాదాపు రూ.2.19 మాత్రమే ఛార్జీ వసూలు చేస్తున్నామని అన్నారు. చైనా, జపాన్, ఫ్రాన్స్ దేశాల్లోని ఇటువంటి సర్వీసుల టికెట్ ధర కంటే ఇది తక్కువేనని అన్నారు. ఆయా దేశాల్లో కిలోమీటరుకు రూ.7 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఈ మేరకు లోక్‌సభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

### పొరుగు దేశాలతో పోల్చినా..

పొరుగు దేశాల రైల్వేల్లో సాధారణ తరగతులతో పోలిస్తే మనదగ్గరే ఛార్జీలు తక్కువని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో కిలోమీటరుకు ఛార్జీ 20 పైసలుగా ఉండగా.. పాకిస్థాన్‌లో 54 పైసలు, బంగ్లాదేశ్‌లో 37 పైసలు, శ్రీలంకలో 51 పైసలుగా ఉందన్నారు. వివిధ వర్గాల ప్రయాణికుల సేవలకు టికెట్ ధరలను నిర్ణయించేటప్పుడు.. సేవలకు అయ్యే ఖర్చు, అందిస్తున్న సదుపాయాలు, ప్రయాణికుల స్తోమత, ఇతర రవాణా సదుపాయాల్లో ఉన్న ఛార్జీలు, సామాజిక-ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. 2019 ఫిబ్రవరిలో వందే భారత్ సర్వీసులు ప్రారంభించామని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 82 రూట్‌లలో 164 సర్వీసులు సేవలందిస్తున్నాయని చెప్పారు. ప్రయాణికుల సర్వీసు విభాగంలో ఈ రైళ్లు ఎంతో ప్రత్యేకమైనవన్నారు. సస్పెన్షన్ సిస్టమ్, వేగం, ఆటోమేటిక్ ప్లగ్ డోర్లు, సౌకర్యవంతమైన సీట్లు, మినీ ప్యాంట్రీ, సీసీ టీవీలు, కవచ్ వంటి అత్యాధునిక వ్యవస్థలు ఈ రైళ్లలో ఉన్నాయన్నారు. ప్రయాణికుల స్తోమతను దృష్టిలో ఉంచుకొని ఈ రైళ్లలో ఛార్జీలను తక్కువగా ఉండేలా చూసుకున్నామని రైల్వే మంత్రి వెల్లడించారు.

## హిందువుల్లో ఆందోళనల వేళ..
# ఎన్నికలకు సిద్ధమైన బంగ్లాదేశ్



**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా రాజీనామా తర్వాత అక్కడి పరిస్థితులు దారుణంగా మారిన సంగతి తెలిసిందే. హిందువులపై మూకదాడులు, హింసాత్మక ఘటనలు నిత్యకృత్యమవడంతోపాటు శాంతి భద్రతలు క్షీణించాయి. హిందువులపై వరుస దాడులతో వారిలో తీవ్ర భయాందోళనలు నెలకొంటున్నాయి. ఇటువంటి నేపథ్యంలో కీలక ఎన్నికలకు బంగ్లాదేశ్ సిద్ధమైంది. దాదాపు పదిహేనేళ్ల హసీనా పాలనకు ముగింపు పలికిన తర్వాత తొలిసారి (ఫిబ్రవరి 12న) జరుగుతున్న ఈ ఎన్నికలను ప్రపంచ దేశాలు కూడా ఆసక్తిగా గమనిస్తున్నాయి. బంగ్లాదేశ్ జనాభా సుమారు 17 కోట్లు. ఎన్నికల సంఘం (ఙుజది) ప్రకారం అక్కడ 12.7 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 50లక్షల మంది కొత్త ఓటర్లే. విదేశాల్లో నివసిస్తున్న బంగ్లా పౌరులకు తొలిసారిగా పోస్ట్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తున్నారు. మొత్తం 1981 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. బంగ్లా జాతీయ సభలో 350 మంది చట్టసభ సభ్యులుండగా.. వీరిలో 300 మందిని ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకుంటారు. మరో 50 స్థానాలు మహిళలకు రిజర్వ్ చేస్తారు. ఆయా పార్టీలు గెలుచుకునే సీట్ల సంఖ్యకు అనుగుణం గా మహిళలకు రిజర్వ్ చేసిన స్థానాలను కేటాయిస్తారు. పార్లమెంట్ సభ్యుల పదవీకాలం ఐదు సంవత్సరాలు. ఈ ఎన్నికలను పరిశీలించేందుకు ఐరోపా యూనియన్, కామన్వెల్త్ దేశాల నుంచి దాదాపు 500 మంది విదేశీ పరిశీలకులు హాజరుకానున్నారు.

### తారిక్‌కు అవకాశాలు..

దశాబ్దాలుగా బంగ్లాలో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్, తారిక్ రెహమాన్ (మొన్నటి వరకు మాజీ ప్రధాని ఖలీదా జియా) సారథ్యంలోని బంగ్లా నేషనలిస్ట్ పార్టీల హవానే కొనసాగుతోంది. అవామీ లీగ్‌పై 2024లో నిషేధం విధించడంతో బీఎన్‌పీ, జమాత్-ఏ-ఇస్లామీ కూటమి మధ్య పోటీ నెలకొంది. హసీనా హయాంలో నిషేధానికి గురైన జమాత్-ఏ-ఇస్లామీ.. ఆమె దేశం వీడిన తర్వాత మళ్లీ క్రియాశీలంగా మారింది. ఈ కూటమిలో మొత్తం 11 పార్టీలు ఉండగా.. ఇటీవల ఆందోళనల సమయంలో ఏర్పడిన నేషనల్ సిటిజన్ పార్టీ భాగస్వామిగా ఉంది. దాదాపు 17ఏళ్ల పాటు విదేశాలకే పరిమితమైన తారిక్ రెహమాన్ ఇటీవలే స్వదేశానికి తిరిగివచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను పునర్నిర్మించడంతో పాటు ఆర్థిక వ్యవస్థ, శాంతి భద్రతల పునరుద్ధరణకు ప్రయత్నిస్తానని హామీ ఇస్తున్నారు. ఈ ఎన్నికల్లో బీఎన్‌పీ ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది.

### ఉద్రిక్తతల వేళ ఎన్నికలు..

దేశ జనాభాలో 90శాతం ముస్లింలే ఉండగా.. 8శాతం హిందువులు ఉన్నట్లు అంచనా. అయితే, మాజీ ప్రధాని షేక్ హసీనా దేశం వీడిన తర్వాత అక్కడ శాంతిభద్రతలు పూర్తిస్థాయిలో క్షీణించాయి. మహిళలతోపాటు హిందువులపై బెదిరింపులు, దాడులు, హింసాత్మక ఘటనలు విపరీతంగా పెరిగాయి. స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని యూనస్ నేతృత్వంలోని యంత్రాంగం చెబుతోంది. ఇదే సమయంలో దేశంలోని అతి పెద్ద రాజకీయ పక్షమైన తమ పార్టీ (అవామీ లీగ్)ని పోటీ చేయకుండా నిషేధించి నిర్వహించే ఈ ఎన్నికలకు ఎలాంటి విలువ ఉండదని షేక్ హసీనా ప్రకటించడం గమనార్హం.

# 4.5 కోట్ల లీటర్ల మద్యం స్వాధీనం..



**బిహార్ :** బిహార్‌లో మద్యపానంపై నిషేధం ఉన్నప్పటికీ.. ఏటా లక్షల లీటర్ల మద్యం సరఫరా అవుతున్నట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో గత తొమ్మిదేళ్లలో 4.5 కోట్ల లీటర్లకు పైగా మద్యం స్వాధీనం చేసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ కేసులకు సంబంధించి 16లక్షల మందిని అరెస్టు చేసినట్లు తెలిపింది. రాష్ట్రంలో చిన్నారులు థిన్నర్లతో పాటు పలు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని, వీటిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని అక్కడి శాసన మండలిలో జేడీయూ ఎమ్మెల్సీ రవీంద్ర ప్రసాద్ సింగ్ లేవనెత్తారు. దీనిపై మంత్రి అశోక్ చౌధరి స్పందిస్తూ.. "రాష్ట్రంలో మద్యం, డ్రగ్స్ నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. చిన్నారులు థిన్నర్లు, ఇతర మత్తు పదార్థాలు వాడుతుండటం కొంతమేర పెరుగుతోంది. 2016లో నిషేధం ప్రకటించినప్పటి నుంచి డిసెంబర్ 2025 వరకు 10లక్షల కేసులు నమోదు చేశాం. 4.5కోట్ల లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడంతోపాటు 16లక్షల మందిని అరెస్టు చేశాం. 1.6లక్షల వాహనాలను సీజ్ చేశాం" అని పేర్కొన్నారు. వీటితోపాటు 15వేల కిలోల గంజాయి, 40వేల లీటర్ల దగ్గు మందుతోపాటు ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సరిహద్దు సమీపంలో యూపీలో పదుల సంఖ్యలో మద్యం దుకాణాలు తెరిచారని, అక్కడి నుంచే రాష్ట్రంలోకి మద్యం భారీగా అక్రమంగా తరలివస్తోందన్నారు.

## మనమెక్కడ చమురు కొనాలో
# అమెరికా చెబుతోంది
### ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ :** అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందే తప్ప.. భారత్‌కు దీనివల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడారు. తన ప్రసంగంలో వాణిజ్య ఒప్పందంతో పాటు ఏఐ ప్రభావం వంటి అంశాల గురించి ప్రస్తావించారు. "ప్రపంచమంతా ఏఐ యుగంలోకి వెళ్తోందని చెబుతున్నారు. దీనివల్ల భారతీయ ఐటీ కంపెనీలు నష్టపోయే ప్రమాదం ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఉంది. మన దేశానికి ప్రతిభావంతులైన యువతరం పెద్ద ఆస్తి. ఏఐకి ఇంధనమే డేటా.. డేటా లేకుండా ఏఐ ఏమీ చేయలేదు. అమెరికా సూపర్ పవర్‌గా కొనసాగాలంటే భారత్ డేటానే కీలకం. గతంలో అధిక జనాభాను సమస్యగా భావించేవారు.. కానీ జనాభా మనకు అతిపెద్ద ఆస్తి. కానీ మన డేటాను రక్షించుకునేందుకు ఇండియా చర్యలు తీసుకోలేదు. అమెరికా కంపెనీల కోసం ట్యాక్స్ హాలిడే ప్రకటించింది" అని రాహుల్ గాంధీ అన్నారు.

### ఒప్పందంతో అమెరికాకే మేలు

"మన దేశం ఏ దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలో అమెరికా చెబుతోంది. వాళ్లు చెప్పినట్లు చేయకపోతే 50 శాతం టారిఫ్‌లు వేస్తామని బెదిరిస్తున్నారు. అమెరికా డిమాండ్లకు తలొగ్గి కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ ద్వారాలు తెరిచింది. గతంలో భారత ఉత్పత్తులపై ఒకప్పుడు కేవలం 3 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు అది 18 శాతానికి చేరింది. అమెరికా దిగుమతులను 46 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచేశారు. భారత్‌కు ఈ ఒప్పందం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు. డాలర్‌ను రక్షించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతోంది" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

### రాహుల్ ప్రసంగంపై రగడ

బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి ప్రస్తావన తీసుకురాగా.. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పూరీ పేర్లను ప్రస్తావించడంపై రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో రాహుల్ గాంధీ వ్యాఖ్యలను రికార్డులనుంచి తొలగించాలని స్పీకర్ ఆదేశించారు. బడ్జెట్ గురించి మాత్రమే మాట్లాడాలని స్పీకర్ సూచించారు. పలుమార్లు రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా.. అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమెరికాకు తలొగ్గి డేటాను, వ్యవసాయాన్ని, ఇంధన రంగాన్ని అమ్మకానికి పెట్టారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించి తన ప్రసంగాన్ని ముగించారు.

# ముంబయి మేయర్‌గా రితూ తావ్డే



**ముంబయి :** ముంబయి మేయర్‌గా మహాయుతికి చెందిన రితూ తావ్డే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 25 ఏళ్లలో భాజపాకు ఈ పదవి దక్కడం ఇదే తొలిసారి. స్థానికంగా భాజపా సీనియర్ నేత అయిన రితూ .. ఘట్కోపర్ వెస్ట్ నుంచి మూడు సార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ విద్యా కమిటీ అధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం కూడా ఆమెకు ఉంది. వార్డు స్థాయిలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొ రేషన్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. కాగా, 227 సీట్ల బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 89 సీట్లు భాజపా గెలుచుకోగా శిందే సేన 29 స్థానాల్లో విజయం సాధించింది.

# నిరసనకారులపై ఉక్కుపాదం..
### క్షమాపణ చెప్పిన ఇరాన్ అధ్యక్షుడు



**ఇరాన్ :** ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తీవ్ర ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆందోళనకారులను అడ్డుకోవడానికి భద్రతా బలగాలు వారిపై ఉక్కుపాదం మోపి, హింసాత్మకంగా అణచివేశాయి. దీనిపై ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఆ సమయంలో భద్రతా బలగాల అణచివేతలో కుటుంబ సభ్యులను కోల్పోయిన, గాయపడిన వారు అనుభవించిన బాధ తనకు తెలుసని అన్నారు. దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభాన్ని కట్టడి చేయలేకపోయినందుకు ప్రభుత్వం సిగ్గుపడుతోందన్నారు. అయితే భద్రతా బలగాలు చేసిన దాడుల్లో అక్కడి నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆయన పేర్కొనలేదు. పాశ్చాత్య దేశాలు చేసిన తప్పుడు ప్రచారాల వల్ల దేశంలో నిరసనలు చెలరేగుతున్నాయన్నారు. కానీ తమ ప్రభుత్వం ఎప్పటికీ ప్రజలతో ఘర్షణలు, ఇతర దేశాలతో యుద్ధాలు కోరుకోదన్నారు. తాము పెద్ద మొత్తంలో అణ్వాయుధాలు తయారు చేస్తున్నామని ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని మసౌద్ పెజెష్కియాన్ పేర్కొన్నారు. శాంతియుత ప్రయోజనాల కోసం అణు శక్తిని ఉపయోగించుకునే చట్టబద్ధమైన హక్కులను మాత్రమే కాపాడుకుంటామన్నారు. చర్చలతో అన్ని సమస్యలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. అదే సమయంలో అమెరికా చేస్తున్న డిమాండ్లకు ఇరాన్ ఎట్టిపరిస్థితుల్లోనూ లొంగదని స్పష్టం చేశారు.



# ఎప్‌స్టీన్ ద్వీపాన్ని సందర్శించాను
### అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్

**యూఎస్ :** ప్రపంచ వ్యాప్తంగా ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం సెగలు పుట్టిస్తున్న వేళ.. అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ అతడి ద్వీపాన్ని సందర్శించినట్లు అంగీకరించారు. తాజాగా అమెరికా కాంగ్రెస్ ఎదుట విచారణకు హాజరై వాంగ్మూలం ఇచ్చారు. తాను ఎప్‌స్టీన్‌తో కలిసి అతడి ప్రైవేటు ద్వీపంలో లంచ్ చేసినట్లు తెలిపారు. గతంలో మాత్రం తాను ఎప్పుడో ఎప్‌స్టీన్‌తో సంబంధాలు తెగదెంపులు చేసుకున్నట్లు ఆయన బుకాయించారు. "నేను ఓ పడవలో ఫ్యామిలీ వెకేషన్‌కు వెళుతున్న సమయంలో.. అతడితో కలిసి భోజనం చేశాను. ఆ సమయంలో నా భార్య నాతోనే ఉంది. అంతేకాదు.. నా పిల్లలు, వారిని చూసుకునే ఆయాలు అక్కడే ఉన్నారు. ఓ గంటపాటు ద్వీపంలో ఉండి లంచ్ చేశాం. అది నిజం. కానీ, ఎందుకు అక్కడికి వెళ్లామో గుర్తులేదు" అని లుట్నిక్ పేర్కొన్నారు. అంతేకాదు 14 ఏళ్ల వ్యవధిలో మూడు సార్లు అతడిని కలిసినట్లు.. 10 ఈ-మెయిల్ సంభాషణలు జరిగినట్లు కూడా అంగీకరించారు. ఇటీవల అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన ఫైల్స్ ప్రకారం 2012 డిసెంబర్ 23న లుట్నిక్ ఎప్‌స్టీన్ ద్వీపం లిటిల్ సెయింట్ జేమ్స్‌ను సందర్శించినట్లు తెలుస్తోంది. ఆ రోజు ఉదయం లుట్నిక్ భార్య ఎప్‌స్టీన్ అసిస్టెంట్‌కు ఫోన్ చేసి తమ బోటు నిలిపేందుకు ఏర్పాట్లు చేయాలని కోరినట్లు ఈ-మెయిల్స్ ద్వారా మళ్లీ వెల్లడైంది.



# ఎప్‌స్టీన్‌ను కలిశా..
### రాహుల్ ఆరోపణలపై కేంద్రమంత్రి క్లారిటీ

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన 'ఎప్‌స్టీన్' ఆరోపణలను కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురీ తీవ్రంగా ఖండించారు. ఇంటర్నేషనల్ పీస్ ఇనిస్టిట్యూట్ బృందంలో భాగంగా తాను ఎప్‌స్టీన్‌ను కలిశానని చెప్పారు. "ఐపీఐలో మా బాస్‌కు ఎప్‌స్టీన్ తెలుసు. కొన్ని సందర్భాల్లో మాత్రమే సమావేశమయ్యాను. కచ్చితంగా చెప్పాలంటే మూడునాలుగు సార్లు. ఒక్కసారి మాత్రమే ఈమెయిల్ చేసుకున్నాం. అతడిపై వచ్చిన ఆరోపణలకు మా మధ్య జరిగిన సంభాషణకు ఎలాంటి సంబంధం లేదు" అని వెల్లడించారు. ఇదంతా అసత్య ప్రచారమంటూ రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. అప్పుడు అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్ సింగ్ పేర్లను ప్రస్తావించారు. "ఈ రోజు విపక్షనేత పార్లమెంట్‌లో కొన్ని విషయాలు మాట్లాడారు. ఆయనకు నిరాధార ఆరోపణలు చేయడం అలవాటు. మన రాజకీయ వ్యవస్థలో రెండురకాల నేతలు ఉంటారు. బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ.. సామాజిక సేవకే జీవితాన్ని అంకితం చేస్తుంటారు. మరికొందరు అప్పుడప్పుడు దేశానికి వస్తారు. వారికి పార్లమెంట్‌లో తగిన సమాధానం ఇచ్చినప్పుడు వినకుండా సభ నుంచి వాకౌట్ చేస్తుంటారు" అని రాహుల్ తీరును విమర్శించారు. అమెరికా ప్రభుత్వం ఇటీవల 30 లక్షల 'ఎప్‌స్టీన్' పేజీలను బయటపెట్టింది. వీటితోపాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలనూ విడుదల చేసింది. ప్రజాసంఘాలు, రాజకీయంగా వచ్చిన ఒత్తిడి కారణంగా రూపొందించిన ఎప్‌స్టీన్ ఫైల్స్ ట్రాన్స్‌పరెన్సీ యాక్ట్ కింద వీటిని విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖులతో సంబంధాలు నెరిపిన ఎప్‌స్టీన్ 2019లో న్యూయార్క్ జైల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మైనర్ బాలికలను అక్రమరవాణా చేశాడన్న ఆరోపణలపై విచారణ ఎదుర్కొన్నాడు. అతడి మాజీ గర్ల్‌ఫ్రెండ్ గిస్లైన్ మ్యాక్స్‌వెల్‌కు 2021లో 20 ఏళ్ల జైలు శిక్షపడింది.

# ఆకాశ ఎయిర్‌లైన్స్ సహ వ్యవస్థాపకుడు ప్రవీణ్ అయ్యర్ రాజీనామా

ఆకాశ ఎయిర్‌లైన్స్ సహ వ్యవస్థాపకుడు, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ ప్రవీణ్ అయ్యర్ తన పదవికి రాజీనామా చేశారు. దాదాపు ఐదేళ్లుగా ఆకాశ ఎయిర్‌లో కొనసాగుతున్న ఆయన కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భాగంగా వైదొలుగుతున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది. అధికారాలు, బాధ్యతలు సక్రమంగా బదిలీ జరిగేందుకు ఏప్రిల్ 30 వరకు ఆయన తన పదవిలో కొనసాగుతారని పేర్కొంది. ఆకాశ ఎయిర్ నుంచి ఉన్నత స్థాయి వ్యక్తులు వైదొలగడం ఇటీవల కాలంలో ఇది రెండోది. మరో సహ వ్యవస్థాపకురాలు నీలు ఖత్రి గతేడాది అక్టోబర్‌లో రాజీనామా చేశారు. 2022 ఆగస్టు 7న ఆకాశ ఎయిర్‌లైన్స్ ప్రారంభమైంది. సంస్థ వ్యవస్థాపకుడు వినయ్ దుబె సీఈఓగా వ్యవహరిస్తున్నారు. అయ్యర్ రాజీనామాతో ప్రస్తుతం నలుగురు సహ వ్యవస్థాపకులు మిగిలారు. ఆకాశ ఎయిర్‌లైన్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుల్లో ఒకరైన అయ్యర్ వైదొలగడంతో.. చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా ఉన్న ఆదిత్య చీఫ్ కమర్షియల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ పదవికి అర్హులైన అభ్యర్థుల కోసం ఆకాశ ఎయిర్ అన్వేషణ మొదలుపెట్టింది. ఆకాశ ఎయిర్‌లైన్స్ నిర్మాణంలో




అయ్యర్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా సీఈఓ వినయ్ దుబె పేర్కొన్నారు. ఆకాశ ఎయిర్ ప్రస్తుతం 33 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలను నడుపుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి విమానయాన సంస్థలు మొత్తంగా కలిపి రూ.5,289.73 కోట్ల నష్టాన్ని ప్రకటించగా.. ఆకాశ ఎయిర్‌కు రూ.1986.25 కోట్ల నష్టం వచ్చినట్లు కేంద్రం ఇటీవల రాజ్యసభకు తెలిపింది. అలాగే, గడిచిన రెండేళ్లలో విమానయాన సంస్థలకు 352 షోకాజ్ నోటీసులు జారీ చేయగా.. అందులో 17 ఆకాశ ఎయిర్ అందుకుంది.







## ఏఐ ప్లాన్‌కు సిద్ధంగా లేకపోతే..

### స్వచ్ఛందంగా వెళ్లిపోవచ్చు: గూగుల్ ఆఫర్

కృత్రిమ మేధ అన్ని రంగాల్లోనూ శరవేగంగా విస్తరిస్తోంది. దానిని అందిపుచ్చుకునే క్రమంలో పలు సంస్థలు సిబ్బంది సంఖ్యలో కోతపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ టెక్ సంస్థ గూగుల్ తన ఉద్యోగులకు ఒక అవకాశం ఇచ్చింది. కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేనివారు.. స్వచ్ఛందంగా పదవీవిరమణ చేయొచ్చని సూచించింది. వారికి స్వచ్ఛంద నిష్క్రమణ ప్యాకేజీని ఆఫర్‌చేసింది. ఈ మేరకు గూగుల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఫిలిప్ షిండ్లర్‌ను ప్రస్తావిస్తూ బిజినెస్ ఇన్‌సైడర్ కథనం పేర్కొంది. గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్ లోని కొందరు ఉద్యోగులకు ఈ ప్యాకేజీ వర్తించనుంది. గూగుల్‌లోని ఈ జీబీఓ యూనిట్.. సంస్థ ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన ప్రకటనలు, గ్లోబల్ రెవెన్యూ గ్రోత్ (ప్రపంచవ్యాప్తంగా కంపెనీ ఆదాయం, అమ్మకాలు)ను పర్యవేక్షిస్తోంది. 2025 ఏడాదికి గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ ఆదాయం 400 బిలియన్ డాలర్లు. 2026ను మెరుగ్గానే ఆరంభించినప్పటికీ.. ఏఐ పరిధి విస్తృతం అవుతోందని, దానిని అందిపుచ్చుకునేవారినే సంస్థ కోరుకుంటోందని షిండ్లర్ పేర్కొన్నారు. అమెరికాలోని కస్టమర్ సేల్స్ టీమ్స్, కస్టమర్ ఫేసింగ్ పొజిషన్స్ (నేరుగా కస్టమర్లతో సంప్రదింపులు జరిపే)కు ఈ ప్యాకేజీ వర్తించదని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛంద నిష్క్రమణ అనేది గూగుల్‌కే పరిమితం కాలేదు. ఇతర టెక్ సంస్థలు అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ ఇలాంటి ప్యాకేజీలను ప్రవేశపెట్టాయి. మైక్రోసాఫ్ట్ తన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు అల్టిమేటం ఇచ్చినట్లు కథనాలు వెలువడ్డాయి.

**రూ.2.9లక్షల కోట్లు సమీకరించిన గూగుల్..**

ఏఐ కార్యక్రమాలను విస్తృతం చేసే లక్ష్యంతో ముందుకువెళ్తోన్న గూగుల్‌కు మార్కెట్‌లో భారీ మద్దతు లభించింది. నిధుల సమీకరణ కోసం ఆల్ఫాబెట్ జారీ చేసిన బాండ్లు మార్కెట్లో అదరగొట్టాయి. దాంతో సంస్థ 24గంటల్లో రూ.2.9 లక్షల కోట్లను సమీకరించింది.



## ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.19.44లక్షల కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఫిబ్రవరి 10 నాటికి నికరంగా రూ.19.44 లక్షల కోట్లు నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే ఈ వసూళ్లలో 9.4 శాతం వృద్ధి నమోదైంది. ఈ మేరకు సంబంధిత గణాంకాలను ఆదాయపు పన్ను విభాగం బుధవారం విడుదల చేసింది. మొత్తం వసూళ్లలో కార్పొరేట్ ట్యాక్స్ రూపంలో రూ.8.90 లక్షల కోట్లు (14.51 శాతం), వ్యక్తిగత, హిందూ అవిభాజ్య కుటుంబాల నుంచి వచ్చే పన్ను వసూళ్లు 5.91 శాతం వృద్ధితో రూ.10.03 లక్షల కోట్లు వచ్చినట్లు ఐటీ విభాగం తెలిపింది. ఏప్రిల్ 1 నుంచి ఫిబ్రవరి 10 వరకు సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ కింద రూ.50,279 కోట్లు వసూలైనట్లు ఆదాయపు పన్ను విభాగం తెలిపింది. ఇదే కాలానికి రూ.3.34 లక్షల కోట్ల రిఫండ్ల రూపంలో జారీ చేసినట్లు పేర్కొంది. స్థూలంగా ఫిబ్రవరి 10 వరకు రూ.22.78 లక్షల కోట్లు పన్ను వసూళ్లు జరిగినట్లు పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం ప్రత్యక్ష పన్ను వసూళ్ల రూపేణ రూ.24.84 లక్షల కోట్లు వస్తుందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది.



## ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. భారత్-అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కారణంగా మూడు రోజుల పాటు వరుస లాభాలు చవిచూసిన సూచీలు.. నేడు మోస్తరు శ్రేణిలోనే కదలాడాయి. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాల వల్ల సూచీలపై ఒత్తిడి పడింది. సెన్సెక్స్ ఉదయం 84,339.15 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,273.92) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84,081.25 - 84,487.34 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 40.28 పాయింట్ల నష్టంతో 84,233.64 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 18.70 పాయింట్ల లాభంతో 25,953.85 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.70గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటెర్నల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎస్‌బీఐ, మారుతీ సుజుకీ, ఇండిగో, ట్రెంట్, రిలయన్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69.71 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5070 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## ఇంగ్లాండ్‌పై వెస్టిండీస్ విజయం

**ముంబయి:** టీ20 ప్రపంచ కప్ 2026లో వెస్టిండీస్ రెండో విజయం అందుకుంది. వాంఖడే వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కరేబియన్ జట్టు 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. 197 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లిష్ జట్టు 19 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లాండ్ బ్యాటర్లలో సామ్ కరన్ (43; 30 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) టాప్ స్కోరర్. జాకబ్ బెథెల్ (33), ఫిల్ సాల్ట్ (30), జోస్ బట్లర్ (21), హ్యారీ బ్రూక్ (17) పరుగులు చేశారు. టామ్ బాంటన్ (2), విల్ జాక్స్ (2) విఫలమయ్యారు. విండీస్ బౌలర్లలో గుడాకేష్ మోటి 3, రోస్టన్ ఛేజ్ 2, రొమారియో షెఫర్డ్, అకీల్ హొస్సేన్, షమర్ జోసెఫ్ తలో వికెట్ పడగొట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. ఐదో స్థానంలో వచ్చిన షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (76; 42 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్సులు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. రోస్టన్ ఛేజ్ (34; 29 బంతుల్లో 6 ఫోర్లు), జేసన్ హోల్డర్ (33; 17 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సులు), షిమ్రోన్ హెట్‌మయర్ (23; 12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు) రాణించారు. విండీస్ చివరి 9 ఓవర్లలో 113 పరుగులు రాబట్టడం విశేషం.




## ఐర్లాండ్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం

**కొలంబో:** టీ20 ప్రపంచ కప్ 2026లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. ఐర్లాండ్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో 67 పరుగుల తేడాతో ఆసీస్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఐర్లాండ్ 16.5 ఓవర్లలో 115 పరుగులకే ఆలౌటైంది. జార్జ్ డాక్రెల్ (41; 29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) టాప్ స్కోరర్. లోర్కాన్ టక్కర్ (24), రాస్ అడైర్ (12), మార్క్ అడైర్ (12) పరుగులు చేశారు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్ 4, ఆడమ్ జంపా 4, కునెమన్ ఒక వికెట్ పడగొట్టారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. మార్కస్ స్టొయినిస్ (45; 29 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), జోష్ ఇంగ్లిస్ (37; 17 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), రెన్ షా (37; 33 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. దూకుడుగా ఆడిన కామెరూన్ గ్రీన్ (21; 11 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సులు) ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. ట్రావిస్ హెడ్ (6), గ్లెన్ మ్యాక్స్‌వెల్ (9) విఫలమయ్యారు. కూపర్ కొన్నోలీ (11ని), బార్ట్‌లెట్ (11ని) పరుగులు చేశారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్ 2, మాథ్యూ హంఫ్రీస్, జార్జ్ డాక్రెల్, హ్యారీ టెక్టర్ తలో వికెట్ తీశారు.

## అది నా వాయిస్ కాదు.. ఏఐ వాడి మార్చారు

### బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా

టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్ బహిష్కరిస్తామని బెదిరించిన పాకిస్థాన్.. ఐసీసీ జోక్యంతో దారికొచ్చిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న కొలంబోలో టీమ్‌ఇండియాతో మ్యాచ్ ఆడతామని పాక్ ప్రకటించింది. చర్చల ద్వారా వచ్చిన ఫలితంతో సంతృప్తి చెందడంతో పాటు మిత్ర దేశాలు విజ్ఞప్తి చేయడంతో భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు తమ జట్టుకు అనుమతి ఇస్తున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం పేర్కొంది. పాక్ మీడియాలో మాత్రం ఇందుకు భిన్నమైన ప్రచారం జరుగుతోంది. పాకిస్థాన్‌కు చెందిన ఓ టీవీలో ఛానెల్ క్రికెట్ షోకు ఆ దేశ మాజీ ఆటగాడు షోయబ్ మాలిక్ హోస్ట్‌గా ఉన్నాడు. సదరు ఛానెల్‌లో బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పాక్‌తో మ్యాచ్ గురించి మాట్లాడిన వీడియోను ప్రసారం చేశారు. భారత్‌తో ఆడేందుకు పాక్‌ను ఒప్పించాలని ఐసీసీపై బీసీసీఐ ఒత్తిడి తెచ్చిందని శుక్లా అన్నట్లుగా ఆ వీడియోలో ఉంది. ఇది సోషల్ మీడియాలో వైరల్ అవడంతో బీసీసీఐ ఉపాధ్యక్షుడు స్పందించారు. తాను ఆ వ్యాఖ్యలు చేయలేదని, ఏఐని ఉపయోగించి తన వాయిస్‌ని మార్చారని పేర్కొన్నారు. "భారత్, పాక్ టీ20 ప్రపంచ కప్ మ్యాచ్ గురించి నేను మాట్లాడాను. ఏఐని ఉపయోగించి ఆడియోను మార్చారు. ఈ వ్యాఖ్యలు నేను చేయలేదు. ఇలా తప్పుదోవ పట్టించే కంటెంట్‌ను నమ్మవద్దని ప్రతి ఒక్కరినీ కోరుతున్నా. ఇలాంటి వీడియోలను సర్క్యూలేట్ చేయొద్దు. వీటిని ఎక్కడ చూసినా రిపోర్ట్ కొట్టండి" అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

## సఫారీలను వణికించిన అఫ్గాన్

### రెండో సూపర్ ఓవర్‌లో గట్టెక్కిన సౌతాఫ్రికా




**అహ్మదాబాద్:** టీ20 ప్రపంచ కప్ 2026లో సంచలన విజయం నమోదైంది. సౌతాఫ్రికా, అఫ్గానిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో రెండుసార్లు సూపర్ ఓవర్లు జరిగాయి. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. తొలుత దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 187/6 పరుగులు చేసింది. అనంతరం అఫ్గానిస్థాన్ 19.4 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది. సూపర్ ఓవర్‌లో అఫ్గాన్ వికెట్ నష్టపోకుండా 17 పరుగులు చేయగా.. సౌతాఫ్రికా మొదటి ఐదు బంతుల్లో 11/1తో నిలవగా.. చివరి బాల్‌కు స్టబ్స్ సిక్స్ బాదడంతో మరో సూపర్ ఓవర్ అనివార్యమైంది. ఇందులో సౌతాఫ్రికా హిట్టర్ డేవిడ్ మిల్లర్ రెండు సిక్సులు, ట్రిస్టన్ స్టబ్స్ ఒక సిక్స్ కొట్టడంతో ఆ జట్టు వికెట్ కోల్పోకుండా 23 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ 19/2కు పరిమితమైంది. మొదటి రెండు బంతుల్లో అఫ్గాన్ పరుగులేమీ చేయకుండానే వికెట్ కోల్పోయింది. తర్వాత రహ్మానుల్లా గుర్బాజ్ హ్యాట్రిక్ సిక్సులు బాదాడు. తర్వాత ఒక వైడ్ రావడంతో అఫ్గాన్ విజయ సమీకరణం ఒక బంతికి ఐదు పరుగులుగా మారింది. ఆఖరి బంతికి గుర్బాజ్.. మిల్లర్‌కు క్యాచ్ ఇవ్వడంతో సఫారీలు ఊపిరిపీల్చుకున్నారు. టాస్ ఓడిన సౌతాఫ్రికా తొలుత బ్యాటింగ్ చేసింది. వన్‌డౌన్ బ్యాటర్ ర్యాన్ రికెల్‌టన్ (61; 28 బంతుల్లో, 5 ఫోర్లు, 4 సిక్సులు), ఓపెనర్ క్వింటన్ డికాక్ (59; 41 బంతుల్లో, 5 ఫోర్లు, 3 సిక్సులు) హాఫ్ సెంచరీలు సాధించారు.

డెవాల్డ్ బ్రెవిస్ (23; 19 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. డేవిడ్ మిల్లర్ 20 పరుగులతో అజేయంగా నిలిచాడు. చివరిలో మార్కో యాన్సెన్ (16; 7 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. ఐడెన్ మార్‌క్రమ్ (5), ట్రిస్టన్ స్టబ్స్ (1) విఫలమయ్యారు. అఫ్గానిస్థాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్జాయ్ 3, రషీద్ ఖాన్ 2, ఫజల్ హక్ ఫారూఖీ ఒక వికెట్ తీసుకున్నారు. 188 పరుగుల లక్ష్యఛేదనలో అఫ్గాన్ 19.4 ఓవర్లలో 187 రన్స్‌కు ఆలౌటైంది. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (84; 42 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్సులు) చెలరేగాడు. అజ్మతుల్లా ఒమర్జాయ్ (22), రషీద్ ఖాన్ (20), దర్విష్ (15), ఇబ్రహీం జద్రాన్ (12) పరుగులు చేశారు. చివర్లో నూర్ అహ్మద్ (15ని; 9 బంతుల్లో 2 సిక్సులు) మెరుపులు మెరిపించినా అఫ్గాన్ లక్ష్యాన్ని అందుకోలేకపోయింది.

## మరింత పెరిగిన కొలంబో విమాన టికెట్ ధరలు




పొట్టి ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరగనుంది. భారత్‌తో మ్యాచ్ ఆడబోమని బెట్టు చేసిన పాక్ ఐసీసీ ఒత్తిడికి తలొగ్గిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైఓల్టేజ్ పోరుకు లైన్ క్లియర్ అయింది. అయితే, ఒక్కసారిగా మ్యాచ్‌కు డిమాండ్ పెరగడంతో భారత్‌లోని ప్రధాన నగరాల నుంచి కొలంబో వెళ్లే విమానాల టికెట్ల ధరలు మరింత పెరిగాయి. సాధారణంగా దిల్లీ నుంచి కొలంబో వెళ్లేందుకు టికెట్ ధర రూ.30,000 ఉంటుంది. కానీ.. ప్రస్తుతం ఆ ధర రూ.90,000లకు చేరుకుంది. బిజినెస్ క్లాస్‌లో అయితే ఏకంగా 1,92,000లకు పెరిగింది. ముంబయి నుంచి కొలంబో మూడు గంటల ప్రయాణానికి శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్‌లో టికెట్ ధర రూ.40,000లుగా ఉంది. విమాన టికెట్ల ధరలతో పాటు హోటల్ గదుల ధరలూ అమాంతంగా పెరిగాయి. ఫిబ్రవరి 14, 15న ప్రీమియం 3 నుంచి ఫైవ్‌స్టార్ హోటళ్లలో ఒక్కరాత్రికి డబుల్ రూమ్స్‌కు రూ.1.05 లక్షల నుంచి 1.06 లక్షల వరకు ఛార్జ్ చేస్తున్నారు. ఇంతకుముందు సాధారణంగా వీటి ధర రూ.40,000 నుంచి 50,000 వరకు ఉండేది. భారత్‌తో మ్యాచ్ బాయికాట్ విషయంలో తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు పాకిస్థాన్ ప్రభుత్వం సోమవారం అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. చర్చల ద్వారా వచ్చిన ఫలితంతో సంతృప్తి చెందడంతో పాటు మిత్రదేశాలు విజ్ఞప్తి చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. కొన్ని రోజులుగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు, ఐసీసీ మధ్య చర్చలు జరుగుతున్నాయి. భారత్‌తో మ్యాచ్ బహిష్కరణ నిర్ణయంపై పునరాలోచించాలని శ్రీలంక, ఎమిరేట్స్ బోర్డులు పీసీబీని కోరాయి. భారత్‌తో మ్యాచ్ ఆడాలని పాకిస్థాన్‌కు తాను విజ్ఞప్తి చేసినట్లు బీసీబీ అధ్యక్షుడు అమినుల్ ఇస్లామ్ చెప్పాడు. శ్రీలంక ప్రధాని అనురకుమార కూడా పాక్ ప్రధానితో ఫోన్‌లో మాట్లాడారని పాక్ ప్రభుత్వం వెల్లడించింది.

## భారత్‌తో పోటీ పాక్‌కు తేలిక కాదు : సౌరభ్ గంగూలీ

పొట్టి ప్రపంచకప్‌లో భారత్‌తో తాము మ్యాచ్ ఆడబోమని మొదట పాకిస్థాన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఐసీసీ హెచ్చరికలకు తలొగ్గి చివరికి యూటర్న్ తీసుకుంది. ఈ అంశంపై బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ మాట్లాడా రు. రాజకీయాలు, క్రీడలు వేరన్నారు. చివరకు పాకిస్థాన్ సరైన నిర్ణయం తీసుకుందన్నారు. అయితే టీమ్‌ఇండియాను ఓడించడం అంత సులువు కాదన్నారు. 'చర్చల గురించి



నాకు తెలియదు. కానీ వారు భారత్‌తో ఆడతామని మంచి నిర్ణయం తీసుకున్నారు. క్రీడలు, రాజకీయాలు వేరు. భారత్, పాక్ మ్యాచ్‌లు ఎప్పుడూ ఆసక్తిగా ఉంటాయి. అయితే కొన్ని సంవత్సరాలుగా పాకిస్థాన్ పెద్దగా పోటీ ఇవ్వడం లేదు. భారత్ అద్భుతమైన జట్టు. టీమ్‌ఇండియాను ఓడించడం పాక్‌కు అంత తేలికైన విషయం కాదు' అని సౌరభ్ గంగూలీ అన్నారు.

రాజముద్ర www.rajamudranews.com ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక

# నిఖిల్ స్వయంభు టీజర్ విడుదల



యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'స్వయంభు'. సమ్మర్ కానుకగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో అత్యున్నత సాంకేతిక విలువలతో, 3ఆ ఫార్మాట్‌లో రూపొందిన ఈ టీజర్ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నిఖిల్ క్రీస్తుశకం 985 నాటి పరాక్రమవంతుడైన యోధుడిగా కనిపిస్తున్నారు. భారీ సెట్టింగ్‌లు, అద్భుతమైన పీరియడ్ వార్ సీక్వెన్స్‌లతో కూడిన ఈ టీజర్, నిఖిల్ మేకోవర్ మరియు ఆయన యుద్ధ విన్యాసాలను అద్భుతంగా ఆవిష్కరించింది. సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ విజువల్స్ సమకూర్చారు. 'కార్తికేయ-2' విజయం తర్వాత నిఖిల్ నటిస్తున్న ఈ చిత్రంపై టాలీవుడ్‌తో పాటు దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.



# ఇక డాక్టర్ శ్రీలీల

## ఎంబిబిఎస్ పట్టా పుచ్చుకున్న నటి

టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల తన జీవితంలో ఒక అద్భుతమైన ఘట్టాన్ని పూర్తిచేసుకుంది. వెండితెరపై నటిగా అలరిస్తున్న ఆమె, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీలగా మారారు. తన మెడికల్ డిగ్రీని విజయవంతంగా పూర్తి చేసిన శ్రీలీల తాజాగా కాన్వోకేషన్ వేడుకలో మెడిసిన్ పట్టాను అందుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు ఫొటోలు వైరల్‌గా మారాయి. నిజానికి శ్రీలీల తన తల్లి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత గారిని స్ఫూర్తిగా తీసుకుని మెడిసిన్ వైపు అడుగులు వేశారు. గత ఏడాది చేతినిండా సినిమాలతో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన లక్ష్యం కోసం చదువుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఒక్కోసారి రోజంతా షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే, విరామ సమయంలో పుస్తకాలు చదువుతూ ఆమె పడ్డ శ్రమ ఇప్పుడు ఫలించింది. చిన్నతనంలో తన అమ్మమ్మ అనారోగ్యం పాలైనప్పుడు ఒక వైద్యురాలిగా సేవ చేయాలన్న తన కోరికను ఆమె నేడు నెరవేర్చుకున్నారు.

# ఓటీటీలోనూ దురంధర్ దూకుడు




ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. దాదాపు రెండు నెలలు థియేటర్‌లలో సందడి చేసి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన ఈ చిత్రం.. ఇప్పుడు ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన 'ధురంధర్'.. జనవరి 30న నెట్‌ఫ్లిక్స్ వేదికగా డిజిటల్ ప్రేక్షకుల ముందుకు అందుబాటులోకి వచ్చింది. స్ట్రీమింగ్‌కు వచ్చిన తొలిరోజు నుంచే వ్యూస్‌లో సత్తా చూపిస్తూ పలు రికార్డులను సొంతం చేసుకుంటోంది. పదిరోజుల్లో ఈ సినిమాకు దాదాపు 16 మిలియన్ల వ్యూస్ (15.9) వచ్చినట్లు నెట్‌ఫ్లిక్స్ తెలిపింది. మొదటి మూడు రోజుల్లోనే 7.6మిలియన్ల వ్యూస్‌తో గ్లోబల్ టాప్-10 నాన్ ఇంగ్లీష్ ఫిల్మ్స్ జాబితాలో నెం.1 స్థానంలో నిలిచిన 'ధురంధర్'. ఫిబ్రవరి 2 నుంచి 8 వరకూ 8.2 మిలియన్ల వ్యూస్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఏకంగా 11 దేశాల్లో నం.1 స్థానంలో కొనసాగుతోంది. తొలిభాగం సూపర్ హిట్ కావడంతో చిత్రబృందం రెట్టింపు ఉత్సాహంతో రెండో పార్ట్‌ను విడుదల చేసేందుకు సిద్ధమైంది. మొదటి భాగానికి మించి ఇది విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత జ్యోతి దేశ్‌పాండే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అందుకే ఐదు భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తొలి చిత్రానికి కొనసాగింపుగా 'ధురంధర్2' రెడీ అవుతోంది. మార్చి 19న ఈ చిత్రాన్ని విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్ పార్ట్2పై అందరినీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే.



## 'స్వయంభు' అందరి అంచనాలు అందుకుంటుంది: సంయుక్త

'స్వయంభు' కోసం నిఖిల్ చాలా కష్టపడ్డారని నటి సంయుక్త అన్నారు. నిఖిల్ ప్రధానపాత్రలో భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా లో సంయుక్త, నభా నటేశ్ కథానాయికలుగా కనిపించనున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంయుక్త మాట్లాడుతూ.. నిఖిల్‌పై ప్రశంసలు కురిపించారు. 'స్వయంభు' కోసం దర్శకుడు చాలా రీసెర్చ్ చేశారని తెలిపారు. ఆయన కథ చెప్పినప్పుడు తాను ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. రెండేళ్ల నుంచి ఈ సినిమా విడుదల కోసం అందరూ ఎదురుచూస్తున్నారని.. అందరి అంచనాలకు తగినట్లే భారీ స్థాయిలో విడుదలవుతుందని వెల్లడించారు.

# తొలి జీతంతో స్కూలు ప్రారంభం

## నటి మోనాలిసా కీలక నిర్ణయం



మహా కుంభమేళాలో పూసల దండలు అమ్ముతూ ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించిన 'కుంభమేళా బ్యూటీ' మోనాలిసా ఇప్పుడు తన జీవితంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. తన మొదటి సినిమా నుంచి వచ్చే రెమ్యునరేషన్‌తో బాలికల కోసం ఒక పాఠశాలను ప్రారంభిస్తానని ప్రకటించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. సాధారణ జీవితం నుంచి సినీ రంగం వరకు ఆమె చేసిన ఈ ప్రయాణం ఇప్పుడు ఎంతో మందికి ప్రేరణగా మారింది. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా సమయంలో మోనాలిసా దండలు అమ్ముతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమెకు అనూహ్యంగా సినిమా అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం ఆమె సినీ పరిశ్రమలో అడుగుపెట్టి వరుస చిత్రాలతో బిజీగా మారింది. ఇటీవల ఆమె తొలి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని భావోద్వేగానికి గురైంది. సినీ ప్రపంచంలోకి వచ్చినా తన పాత జీవితాన్ని ఎప్పటికీ మర్చిపోనని, ఆ అనుభవాలే తనకు బలం ఇచ్చాయని తెలిపింది. ఇటీవల మోనాలిసా మళ్లీ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి గంగా తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. తన జీవితాన్ని మార్చిన ఆ స్థలానికి కృతజ్ఞతలు తెలుపుతూ, సమాజానికి తిరిగి ఏదో చేయాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లోని ఖార్గోన్ జిల్లాలో బాలికల కోసం పాఠశాల స్థాపించాలన్నదే తన కల అని చెప్పింది. ఆ ప్రాంతాల్లో అమ్మాయిలకు సరైన విద్యావకాశాలు లేవని, చదువు లేక వెనుకబడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.
బాలికల విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని, అందుకే తన సంపాదనను వ్యక్తిగత సౌకర్యాల కోసం కాకుండా భవిష్యత్ తరాల కోసం వినియోగించాలనుకుంటున్నానని మోనాలిసా స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆమె మూడు సినిమాలతో బిజీగా ఉంది. అందులో రెండు తెలుగు చిత్రాలు కాగా, మరోటి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్'. సినీ రంగంలో ఎదుగుతూ సమాజానికి సేవ చేయాలన్న ఆమె సంకల్పం నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.

# వపన్, సురేందర్ రెడ్డి కాంబో పక్కా మాస్ ఎంటర్టైనర్ మూవీ



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్ట్ గురించి ఫిలిం నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. సాధారణంగా సురేందర్ రెడ్డి అంటే స్టైలిష్ యాక్షన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాడు. కానీ ఈసారి పవన్ కళ్యాణ్ కోసం ఆయన తన పంథాను పూర్తిగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. పవన్ చేసిన యాక్షన్ సినిమా కంటే భిన్నంగా గతంలో సురేందర్ రెడ్డి అందించిన 'కిక్', 'రేసుగుర్రం' తరహాలో పక్కా హై-వోల్టేజ్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను పవన్ కోసం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే మేనరిజమ్స్‌తో కూడిన వినోదాన్ని వెలికితీయడమే లక్ష్యంగా రచయిత వక్కంతం వంశీ ఈ స్క్రిప్ట్‌ను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాలో పవన్‌కు జోడీగా ప్రభాస్ 'ఫౌజీ' సినిమా హీరోయిన్ ఇమాన్వీ పేరు ప్రముఖంగా వినిపిస్తుండటం విశేషం. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించి మరో క్రేజీ అప్‌డేట్ ఏమిటంటే, ఇందులో పవన్ కళ్యాణ్‌కు తమ్ముడిగా ఒక యువ అగ్ర హీరో నటించే అవకాశం ఉందని, అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో సాగే పక్కా మాస్ మూవీగా ఇది ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. నిర్మాత రామ్ తాళ్లూరి దాదాపు రూ. 250 కోట్ల భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తన రాజకీయ బాధ్యతల నడుమ షూటింగ్‌లో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 2026 మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ ఉన్నారు. ఇప్పటికే పవన్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 26, విడుదల కానుండగా, ఆ వెంటనే ఈ భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com